తెలుగు దినపత్రిక
ప్రభాత
jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 03
పేజీలు : 8
వెల : 4
శనివారం, 15-07-2023

విలేకర్లు కావలెను

జయభేరి దినపత్రిక, జయభేరి ఛానల్‌లో
నిఖార్సైన జర్నలిస్టులుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు.. కథనాలు...
ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలనుకుంటున్నారా?
మీ కలాలకు పదును పెట్టండి....

ఆసక్తి కలిగిన యువతి యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత

9391 544 889 call me


2 లో

## భారతీయులకు శుభవార్త..
## చంద్రయాన్ 3 తొలి దశ విజయవంతం

**చంద్రయాన్ 3 విజయంపై ఇస్రో టీమ్ కు సెల్యూట్ చేసిన : మోదీ**

**దశాబ్దాల కృషికి ఫలితమని అభినందించిన : రాహుల్ గాంధీ**

**బీసీల్లో వెనుకబడిన చేతివృత్తులు, కుల వృత్తుల కుటుంబాలకు**

**ఇవాళ్టి నుంచి రూ. లక్ష సాయం అందించనుంది సర్కార్.**

**తొలి విడతలో భాగంగా లబ్ధిదారులను గుర్తించింది.**

# నేటినుంచే లక్ష సాయం



**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణలోని బీసీ చేతి, కుల వృత్తుల వారికి రూ.లక్ష ఆర్థికసాయం పథకాన్ని తెలంగాణ సర్కార్ తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ పూర్తికాగా.... లబ్ధిదారుల ఎంపిక పై కసరత్తు పూర్తి చేసింది. తొలి విడతలో భాగంగా... ఎంపికైన లబ్ధిదారులకు ఇవాళ్టి నుంచి చెక్కులను అందజేయనుంది. ప్రతి నియోజకవర్గానికి 300 మంది చొప్పున ఇవ్వనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 35,700 మందికి రూ.లక్ష సాయం అందనుంది. చెక్కులను స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇవ్వనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ స్కీమ్ ను దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంచిర్యాల వేదికగా ముఖ్యమంత్రి కేసీఆర్ లాంఛనంగా ప్రారంభించారు. పలువురు లబ్ధిదారులకు చెక్కులను కూడా అందజేసిన సంగతి తెలిసిందే. రూ. లక్ష సాయం కోసం రాష్ట్రవ్యాప్తంగా భారీగా దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 5,28,862 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. వీటిని పరిశీలించిన తర్వాత... తొలి విడతలో భాగంగా ఎవరిని ఎంపిక చేయాలనే దాన్ని నిర్ణయించారు అధికారులు. ఇందులో భాగంగా... ఇవాళ లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తారు. మరికొన్ని విడతల్లో అర్హులైన వారిన ఎంపిక చేస్తారు. జూలై 18 నుంచి మిగిలిన దరఖాస్తుల పరిశీలన ప్రారంభం కానున్నది.

ఇదే విషయంపై ప్రభుత్వం ఇప్పటికే ప్రకటన చేసింది. విడతల వారీగా ప్రతి నెల 15వ తేదీన చెక్కులను అందజేస్తామని పేర్కొంది. ప్రతి నెల 5వ తేదీలోపు కలెక్టర్లు లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వానికి పంపిస్తారు. ఇన్‌చార్జి మంత్రులు ధ్రువీకరించిన జాబితాలోని లబ్ధిదారులకు ప్రతి నెలా 15లోగా స్థానిక ఎమ్మెల్యేలు రూ.లక్ష ఆర్థికసాయం అందజేస్తారు. దరఖాస్తు ఫారంను ఏ ఆఫీసులోనూ, ఏ అధికారికి అందజేయాల్సిన అవసరం లేదు. లబ్ధిదారులు నెలరోజుల్లోగా తమకు నచ్చిన, కావాల్సిన పనిముట్లను, సామగ్రిని కొనుకోవాలని... ఆ నిర్ణయాధికారం పూర్తిగా లబ్ధిదారులదేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. సంకొనుగోలు చేసిన యూనిట్ల ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.



### స్కీమ్ మార్గదర్శకాలు...

లక్ష రూపాయ ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు బీసీ కులవృత్తిదారులు, చేతివృత్తిదారులు అర్హులు అవుతారు. కుటుంబంలో ఒక్కరికి మాత్రమే వృత్తుల అభ్యున్నతికి ఆర్థిక సాయం అందిస్తారు. ఆయా కులాల పనిముట్ల కొనుగోలు, ఆధునీకరణ లేదా ముడిసరుకు కొనుగోలుకు మాత్రమే ఆర్థిక సాయం అందిస్తారు. దరఖాస్తుదారుల వయస్సు జూన్ 2 నాటికి 18 55 ఏళ్లు ఉండాలి. వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించకూడదు. దరఖాస్తు తేదీ నుంచి గత 5 ఏండ్లలో ఏ ప్రభుత్వ శాఖ ద్వారా కూడా లబ్ధిపొందినవారు అర్హులు కారు. ఇక 2017 18లో రూ.50 వేల ఆర్థిక సాయం పొందిన వారు ఈ స్కీమ్ కు అనర్హులు అవుతారు. జూన్ 20 తేదీ వరకు అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. రేషన్‌కార్డు, కుల, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో కూడిన దరఖాస్తులను స్వీకరించారు.

## ఎన్నికల వేళ కాంగ్రెస్ కీలక నిర్ణయం...
# పొంగులేటికి కొత్త బాధ్యతలు

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ దూకుడు పెంచుతోంది. ఇందులో భాగంగా... టీపీసీసీ ప్రచార కమిటీని ప్రకటించింది. ఇందులో పొంగులేటికి కీలక బాధ్యతలు అప్పగించింది.

మరికొద్ది రోజుల్లోనే తెలంగాణలో ఎన్నికల సమరం మొదలుకాబోతుంది. ఇప్పటికే ప్రధాన పార్టీలన్నీ ఆ మూడ్ లోకి వెళ్లాయి. ఎవరికి వారిగా గెలిచే అభ్యర్థులపై దృష్టిపెట్టాయి. ఏ మాత్రం తేడా అనిపించినా... పక్కనపెట్టేస్తూ కొత్త వారి కోసం అన్వేషించే పనిలో పడ్డాయి. ఇక ఈసారి ఎలాగైనా తెలంగాణను కొట్టాలని భావిస్తున్న కాంగ్రెస్ మాత్రం....గతానికి భిన్నంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే పలు రకాల డిక్లరేషన్ లను ప్రకటించి... జనాల్లోకి తీసుకెళ్తోంది. ఇదే సమయంలో ఆపరేషన్ ఆకర్షన్ పై గురి పెట్టింది. పొంగులేటి, జూపల్లితో పాటు ఇతర నేతలను పార్టీలోకి రప్పించటంలో సక్సెస్ అయింది. త్వరలోనే కొల్లాపూర్ వేదికగా భారీ సభను నిర్వహించబోతుంది. ఇదిలా ఉంటే... వచ్చే ఎన్నికల కోసం కొత్త ప్రచార కమిటీని ప్రకటించింది కాంగ్రెస్. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

మిగతా 2 లో




7 లో

## దక్షిణాఫ్రికా నుంచి తీసుకువచ్చిన వాటిలో మరో చీతా మృతి

## వారికి పట్టాదారు హక్కులు రావు అసైన్డ్ భూములపై మంత్రి ధర్మాన కీలక ప్రకటన

**రాష్ట్రంలో వైసీపీ సర్కార్ పెద్ద ఎత్తున భూ సంస్కరణలు తీసుకవచ్చిందన్నారు మంత్రి ధర్మాన ప్రసాదరావు. ఈ క్రమంలోనే అసైన్డ్ భూములకు కూడా హక్కులు కల్పించామని చెప్పారు. అనధికారికంగా అసైన్డ్ భూములను కొన్నవారికి హక్కులు రావని స్పష్టం చేశారు.**

2 లో

## ఏపీలో ఇసుక తవ్వకాలపై నిషేధం !
## సమర్థించిన సుప్రీంకోర్టు

**ఏపీలో ఇసుక తవ్వకాల విషయంలో సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. గతంలో ఎన్జీటీ ఇచ్చిన ఆదేశాలను సమర్థించింది. స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.**


2 లో




తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ

2 లో




ఇండియా కోసం టెస్లా క్రేజీ ప్లాన్..

6 లో

ప్రభాత జయభేరి
jayabheridaily.com

▸▸ మొదటిపేజీ తరువాయి

టీపీసీసీ ప్రచార కమిటీకి గతంలో చైర్మన్‌గా ఉన్న మధు యాష్కీ గౌడ్ కు మరోసారి అవకాశం కల్పించింది కాంగ్రెస్. ఇటీవలే కాంగ్రెస్ లో చేరిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ప్రచార కమిటీలో చోటు కల్పించింది. టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్‌గా నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశాలు ఇచ్చారు. కన్వీనర్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీల ఉండగా... మొత్తం 37 మందిని కార్యనిర్వాహక సభ్యులుగా నియమించింది. టీపీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమ కుమార్, ప్రవీణ్ రెడ్డి, కత్తి కార్తీక గౌడ్, మహ్మద్ జావేద్ అక్రమ్, నరేంద్ర ముదిరాజ్, జూలూరు ధనలక్ష్మి గౌడ్, చనగాని దయాకర్ గౌడ్, వరంగల్ రవి, నాగన్న, అముగోతు వెంకటేశ్, రాములు యాదవ్, దాస్ గౌడ్, కెప్టెన్ కరుణాకర్ రెడ్డి, గడుగు రోహిత్, బండ శంకర్, కోలా వెంకటేశ్, దినేశ్ సాగర్ ముదిరాజ్, గోపాల్‌రెడ్డి, దండెం రాంరెడ్డి, శ్రీకొండ మల్లేష్, కోట శ్రీనివాస్, గిరి కొండల్, సంగీతం శ్రీనివాస్, చారులత రాథోడ్, రేణుక, గిరి నాగభూషణం, భీం భరత్, కె.శివ కుమార్, సాయిని రవి, రఘువీర్ గౌడ్, డా.కె.విజయ్‌కుమార్, జి. లోకేశ్ యాదవ్, ఏఎం ఖాన్, జంగారెడ్డి, డా. వడ్డేపల్లి రవి, తాటికొండ శ్రీనివాస్, డా. మోతీ లాల్‌ను కార్యనిర్వాహక సభ్యులుగా ఉన్నారు. ఇక పీసీసీ అధ్యక్షుడు, సీఎల్పీ నేత, కౌన్సిల్ నేత, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు ప్రచార కమిటీలో ప్రత్యేక ఆహ్వానితులుగా చేర్చారు. మరోవైపు లోక్ సభ స్థానాలకు సంబంధించి కూడా కీలక నిర్ణయం తీసుకుంది కాంగ్రెస్ హైకమాండ్. తెలంగాణలోని 17 పార్లమెంట్ స్థానాలకు పర్యవేక్షకులను నియమించింది. ఇతర రాష్ట్రాలకు చెందిన ముఖ్య నేతలకు ఈ బాధ్యతలను ఇచ్చింది. ఈ మేరకు జాబితాను విడుదల చేసింది.

## ఏపీలో ఇసుక తవ్వకాలపై నిషేధం ! సమర్థించిన సుప్రీంకోర్టు



ఏపీ సర్కార్ కు షాక్ ఇచ్చింది సుప్రీంకోర్టు. ఏపీలో ఇసుక తవ్వకాల విషయంలో సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. అక్రమంగా జరుగుతున్న ఇసుక తవ్వకాలపై గతంలో వచ్చిన ఫిర్యాదులను విచారించిన జాతీయ హరిత ట్రైబ్యునల్ వీటిపై నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. వీటిపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఏపీ ప్రభుత్వానికి ఊరట దక్కలేదు. ఎన్జీటీ ఆదేశాలపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.ఫలితంగా ఏపీలో ఇసుక తవ్వకాలు నిలిచిపోనున్నాయి. ఏపీలో అక్రమ ఇసుక తవ్వకాలపై గతేడాది మార్చి 23న ఎన్జీటీ నిషేధం విధించింది. దీన్ని ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీనిపై న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ సంజయ్ కరోల్ ధర్మాసనం విచారణ జరిపింది. వాదోపవాదాలు విన్న తర్వాత ఎన్జీటీ తీర్పుపై స్టే ఇవ్వడానికి సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. ఎన్జీటి తీర్పును సుప్రీంకోర్టు సమర్థిస్తూ, దాన్ని యథాతథంగా అమలు చేయాలని ఆదేశించింది. రాష్ట్రంలో అడ్డగోలుగా కొనసాగుతున్న ఇసుక తవ్వకాలను నిషేధించాలంటూ ఎన్జీటి ఇచ్చిన తీర్పుపై స్టే ఇవ్వడానికి ధర్మాసనం నిరాకరించింది. బి 2 కేటగిరీ ఇసుక రీచ్‌లలో పాక్షికంగా యంత్రాలతో ఇసుక త్వవకానికి అనుమతి ఇవ్వడం చట్ట విరుద్ధమని ఎన్జీటి పేర్కొంది. బి 1, బి 2 కేటగిరీల కింద ఇసుక తవ్వకాల కోసం ఇప్పటికే ఇచ్చిన అన్ని రకాల పర్యావరణ అనుమతులను పరిశీలన చేయాలని ఎన్జీటి ఆదేశించింది. రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా సంస్థ పర్యావరణ అనుమతులను పునః పరిశీలన చేయాలని స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఇసుక రీచ్‌ల పరిధిలో పర్యావరణ విధ్వంసం పరిశీలన, అంచనా కోసం ఎన్జీటి నిపుణుల కమిటీని నియమించింది. ఇసుక తవ్వకాలతో పర్యావరణానికి జరిగిన నష్టాన్ని గుర్తించాలని కూడా నిపుణుల కమిటీని ఆదేశించింది. రివర్ బెడ్లు, నదీ తీరాల్లో భారీ యంత్రాలతో మైనింగ్ చేసుకోవచ్చంటూ అనుమతివ్వడంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పర్యావరణ శాఖ కార్యదర్శిని ఆదేశించింది. ఎన్జీటి విధించిన రూ.18 కోట్ల జరిమానాపై మాత్రమే సుప్రీం ధర్మాసనం స్టే విధించింది. ప్రతివాదులైన నాగేంద్ర కుమార్, హేమకుమార్‌లకు న్యాయస్థానం నోటీసులు జారీచేసింది.

GOVERNMENT OF TELANGANA
తెలంగాణ ప్రభుత్వము

## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ

మరికొద్దిరోజుల్లో ఎన్నికలు సమీపిస్తున్న వేళ తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. పెద్ద ఎత్తున ఐఎస్ఎస్ అధికారుల బదిలీలను చేపట్టింది. 31 మంది ఐఏఎస్ అధికారులను ట్రాన్స్‌ఫర్ చేస్తూ శుక్రవరం ఉత్తర్వులు జారీ చేసింది. వీరంతా పోస్టింగ్ కోసం ఎంతో కాలంగా వేచి చూస్తుండగా... బదిలీ అయిన 31 మందిలో 16 మంది మహిళలు ఉన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.
శశాంక్ గోయల్ ఎంఆర్‌హెచ్‌ఆర్‌డీఐ డైరెక్టర్ జనరల్. హరిచందన ఆయుష్ డైరెక్టర్‌గా నియామకం. శైలజా రామయ్యర్ యువజన సర్వీసులు, పర్యాటకశాఖ ముఖ్యకార్యదర్శిగా నియామకం, ఆర్కియాలజీ డైరెక్టర్, క్రీడాపాధికార సంస్థ ఎండీగా అదనపు బాధ్యతలు. అలగు వర్షిణి హస్తకళల అభివృద్ధి సంస్థ ఎండీ. కొర్రా లక్ష్మీ క్రీడల సంచాలకులుగా నియాకం. మావతి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డైరెక్టర్, కె.హరిత ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలు. కె.నిఖిల రాష్ట్ర పర్యాటకశాఖ సంచాలకులుగా బాధ్యతలు, ప్రియాంం ఆల భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా నియామకం. ఐలా త్రిపాఠి ములుగు కలెక్టర్‌గా నియామకం, కృష్ణ ఆదిత్య కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి, సత్యశారదాదేవి వ్యవసాయ శాఖ ఉపకార్యదర్శిగా నియామంక, ముజమిల్ ఖాన్ పెద్దపల్లి కలెక్టర్‌గా నియామకం, సత్యనారాయణ టీఎస్‌ఫుడ్స్ ఎండీగా బాధ్యతలు. ప్రతీక్ జైన్ భద్రాచలం ఐటీడీఏ పీవోగా నియామకం. పి.గౌతం సెర్ప్ సీఈవో, అనుదీప్ దురిశెట్టి హైదరాబాద్ కలెక్టర్, ఎస్.స్నేహ జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్‌గా నియామకం. మంద మకరందు నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా నియామకం, నవీన్ నికోలస్ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శిగా బాధ్యతలు. గత వారమే నలుగురు ఐఎస్ఎస్ లను కూడా బదిలీ చేసింది తెలంగాణ సర్కార్. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్ గా రోనాల్డ్ రాస్ ను నియమించిన సంగతి తెలిసిందే. లోకేశ్ కుమార్ ను ఎన్నికల అధికారిగా, ఎక్సైజ్ శాఖ కమిషనర్ గా ముషారఫ్ అలీ, రాష్ట్ర సంయుక్త ఎన్నికల అధికారిగా సర్ఫరాజ్ ను నియమించింది.

# భారతీయులకు శుభవార్త..
# చంద్రయాన్ 3 తొలి దశ విజయవంతం

### చంద్రయాన్ 3 విజయంపై ఇస్రో టీమ్ కు సెల్యూట్ చేసిన : మోదీ
### దశాబ్దాల కృషికి ఫలితమని అభినందించిన : రాహుల్ గాంధీ

భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న చంద్రయాన్ ప్రాజెక్టులో మూడో మిషన్ చంద్రయాన్ 3 విజయవంతంగా ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ లోని శ్రీహరి కోటలో ఉన్న సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఈ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించారు.

**నిర్దేశిత కక్ష్యలోకి..**

లాంచ్ ప్యాడ్ 2 నుంచి చంద్రయాన్ 3 మోడ్యూల్స్ తో ఎల్వీఎం 3 బాహుబలి రాకెట్.. సరిగ్గా జులై 14, శుక్రవారం మధ్యాహ్నం 2.35 గంటలకు నిప్పులు చిమ్ముతూ ఆకాశంలోకి దూసుకుపోయింది. రాకెట్ లో తొలి దశలో సాలిడ్ ఫ్యూయెల్ ను, తరువాత దశల్లో లిక్విడ్ ఫ్యుయెల్ ను ఉపయోగించారు. చంద్రుడిపై ఎలాంటి ఇబ్బందులు లేకుండా ల్యాండర్ ను దించడం ఈ మిషన్ ప్రధాన లక్ష్యం.

**చంద్రయాన్ ప్రయోగాలు..**

ఇప్పటివరకు చంద్రయాన్ ప్రాజెక్టులో మూడు ప్రయోగాలు చేపట్టారు. మొదటి ప్రయోగం చంద్రయాన్ 1 విజయవంతమైంది. అంతేకాదు, చంద్రుడిపై నీటి జాడలున్నాయని వెల్లడించి, ప్రపంచాన్ని భారత్ ఆశ్చర్యపరిచింది. 2019 లో చేపట్టిన రెండో ప్రయోగమైన చంద్రయాన్ 2 విఫలమైంది. నిజానికి చంద్రయాన్ 2 పాక్షికంగా విజయవంతమైందని చెప్పవచ్చు. ఎందుకంటే, చివరి దశ అయిన ల్యాండింగ్ వరకు ఈ ప్రయోగం విజయవంతమైంది. కానీ, చంద్రుడి ఉపరితలంపైకి దిగే సమయంలో విఫలమై, కుప్పకూలిపోయింది. దాంతో, పూర్తి జాగ్రత్తలు తీసుకుని, మళ్లీ సాఫ్ట్ వేర్ ను పూర్తిగా మార్చి, చంద్రయాన్ 3 ప్రయోగం చేపట్టారు. చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్ ఈ ప్రయోగంలో కీలక ఘట్టం. ఒకవేళ, ఈ ప్రయోగం విజయవంతమైతే, చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండ్ అయిన నాలుగో దేశంగా భారత్ నిలుస్తుంది. ఇప్పటివరకు ఈ ఘనత అమెరికా, సోవియట్ యూనియన్, చైనా సాధించాయి.

**615 కోట్ల కనీస ఖర్చుతో..**

చంద్రయాన్ 3 కోసం కనీస మొత్తమైన సుమారు రూ. 615 కోట్లను ఖర్చు చేశారు. చంద్రయాన్ 3 లో ప్రొపల్షన్ మోడ్యూల్, ల్యాండ్ మోడ్యూల్, రోవర్ మోడ్యూల్ ఉంటాయి. వీటిని దేశీయంగా నే రూపొందించారు. ఆగస్ట్ మూడో వారంలో చంద్రుడిపై చంద్రయాన్ 3 ల్యాండర్ విజయవంతంగా దిగిన అనంతరం.. అందులో నుంచి ర్యాంప్, ర్యాంప్ పై నుంచి రోవర్ బయటకు వస్తాయి. రోవర్ కు ఆరు చక్రాలు ఉంటాయి. చంద్రుడి ఉపరితలంపై తిరుగుతూ ఆ రోవర్ తన చుట్టూ ఉన్న అడ్వాన్స్డ్ కెమరాలతో ఫొటోలను తీస్తుంది.

**చంద్రయాన్ 3 విజయంపై ఇస్రో టీమ్ కు సెల్యూట్ చేసిన : మోదీ**
**దశాబ్దాల కృషికి ఫలితమని అభినందించిన : రాహుల్ గాంధీ**



చంద్రయాన్ 3 తొలి దశ ప్రయోగం విజయవంతమైన కొన్ని నిమిషాల్లోనే ప్రధాని మోదీ స్పందించారు. ఇస్రో టీమ్ కు, భారతీయులకు శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్ చేశారు. ''భారతదేశ అంతరిక్ష ప్రయాణంలో చంద్రయాన్ 3 కొత్త అధ్యాయం



లిఖిస్తోంది'' అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ఈ ప్రయోగం ప్రతీ భారతీయుడి ఆశయాలను, లక్ష్యాలను, స్వప్నాలను మరింత ఎత్తుకు తీసుకు వెళ్తుందని ఆయన ఆకాంక్షించారు. ఈ ప్రయోగం విజయవంతం కావడం మన శాస్త్రవేత్తల అలుపెరగని కృషికి, వారి అంకితభావానికి నిదర్శనం. వారి స్ఫూర్తికి, పట్టుదలకు నా సెల్యూట్'' అని మోదీ ఇస్రో శాస్త్రవేత్తలను ప్రశంసించారు.
చంద్రయాన్ 3 విజయవంతంగా కక్ష్యలో ప్రవేశించడంపై కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ సంతోషం వ్యక్తం చేశారు. 'ఇది చాలా అద్భుతమైన సందర్భం. గొప్ప విజయం. ఇస్రో టీమ్ కు నా శుభాభినందనలు' అని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. 'ఈ రోజు 100 కోట్లకు పైగా భారతీయులు గర్వంగా ఆకాశంలోకి చూస్తూ, విజయోత్సవాలు జరుపుకున్నారు. 1962 లో స్పేస్ ప్రొగ్రామ్ ప్రారంభమైంది. ఆ తరువాత 1969 లో ఇస్రో ను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం స్థాపించింది. ఆ నాటి నుంచి భారతీయ శాస్త్రవేత్తలు కృషి, పట్టుదల, తెలివితేటలతో అంతరిక్ష పరిశోధనల్లో భారత్ ఉన్నత శిఖరాలకు చేరింది. తాజా ప్రయోగం విజయవంతమైతే, చంద్రుడిపై ల్యాండ్ అయిన నాలుగో దేశంగా భారత్ నిలుస్తుంది'' అని రాహుల్ స్పందించారు.
దాదాపు నెల రోజులకు పైగా, 3 లక్షల కిమీలు ప్రయాణించిన తరువాత చంద్రయాన్ 3 చంద్రుడి ఉపరితలంపై దిగడానికి సిద్ధమవుతుంది. ఆగస్ట్ 23 వ తేదీన చంద్రుడిపై చంద్రయాన్ 3 ల్యాండర్ సేఫ్ ల్యాండ్ అవుతుంది. ల్యాండ్ అయిన తరువాత ల్యాండర్ లో నుంచి బయటకు వచ్చిన రోవర్ అక్కడ ఒక ల్యూనార్ డే (భూమిపై 14 రోజులు) చంద్రుడి ఉపరితలంపై తిరుగుతూ, అక్కడి ఉపరితలాన్ని, వాతావరణాన్ని పరిశీలిస్తుంది. అత్యాధునిక కెమెరాలతో ఫొటోలు తీస్తుంది.



### 'చంద్రయాన్ 3' వెనుక కీలక శక్తి ఈ మహిళ.. డాక్టర్ రీతు కరిధాల్..
## 'రాకెట్ విమన్ ఆఫ్ ఇండియా'

ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రయోగం చంద్రయాన్ 3. భారతదేశం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ ప్రయోగం జులై 14 మధ్యాహ్నం 2. 35 గంటలకు జరగనుంది. అయితే, ఈ ప్రయోగం వెనుక ఉన్న కీలక శక్తి ఒక మహిళ. ఆమే రాకెట్ విమన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన డాక్టర్ రీతు కరిధాల్ శ్రీ వాస్తవ.

**రాకెట్ విమన్ ఆఫ్ ఇండియా..**

భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ లో డాక్టర్ రీతు కరిధాల్ సీనియర్ సైంటిస్ట్ గా పని చేస్తున్నారు. ప్రస్తుతం చంద్రయాన్ 3 ప్రాజెక్టును ఆమెనే లీడ్ చేస్తున్నారు. డాక్టర్ రీతు కరిధాల్ చంద్రయాన్ 2 ప్రాజెక్టుకు మిషన్ డైరెక్టర్ గా వ్యవహరించారు. అలాగే, గురు గ్రహం పైకి స్పేస్ షిప్ ను పంపించడానికి ఉద్దేశించిన 'మంగళ్ యాన్' ప్రాజెక్టుకు డిప్యూటీ ఆపరేషన్స్ డైరెక్టర్ గా ఉన్నారు. ఆమె ఇస్రో వర్గాల్లో రాకెట్ విమన్ ఆఫ్ ఇండియా గా పాపులర్.

**డాక్టర్ అబ్దుల్ కలాం చేతుల మీదుగా..**

డాక్టర్ రీతు కరిధాల్ శ్రీ వాస్తవ ఉత్తర ప్రదేశ్ లోని లక్నో లో జన్మించారు. లక్నో యూనివర్సిటీలో బీఎస్సీ చదివారు. ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నుంచి ఏరో స్పేస్ ఇంజనీరింగ్ లో ఎంఈ డిగ్రీ పొందారు. 1997 లో ఆమె ఇస్రోలో చేరారు. మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చేతుల మీదుగా ఆమె ' ఇస్రో యంగ్ సైంటిస్ట్' అవార్డును పొందారు. మంగళయాన్ ప్రాజెక్టు కోసం చేసిన కృషికి గానూ.. ఆమె టీమ్ కు 2015 లో ఇస్రో టీమ్ అవార్డ్ లభించింది. 2017 లో విమన్ అచీవర్స్ ఇన్ ఏరోస్పేస్ పురస్కారాన్ని కూడా పొందారు. చిన్నప్పటి నుంచి అంతరిక్షమన్నా, ఆకాశంలోని నిగూఢ లోతులన్నా ఆమెకు అత్యంత ఆసక్తి. బాల్యం నుంచే ఇస్రో, నాసాకు సంబంధించిన వార్తలు ఉన్న పేపర్ కటింగ్స్ ను సేకరించి, భద్రపర్చుకునేవారు. వివిధ జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ లో ఆమె 20 కి పైగా పేపర్స్ ను పబ్లిష్ చేశారు. చంద్రుడి దక్షిణ ధ్రువాన్ని పరిశోధించే నిమిత్తం చంద్రయాన్ 3 ప్రయోగం చేపట్టారు. జులై 14, మధ్యాహ్నం 2.35 గంటలకు ఆంధ్రప్రదేశ్ లోని శ్రీహరి కోటలో ఉన్న సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి చంద్రయాన్ 3 ని ప్రయోగించనున్నారు. భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్ ప్రాజెక్టులో ఇది మూడో మిషన్. చంద్రయాన్ 1 విజయవంతమైంది. కానీ చంద్రయాన్ 2 చివరి దశలో ల్యాండింగ్ సమయంలో, చంద్రుడి ఉపరితలంపై కుప్పకూలిపోయింది. చంద్రయాన్ 3 ని జీఎస్ఎల్వీ మార్క్ 3 లాంచ్ వెహికిల్ తో ప్రయోగిస్తున్నారు.

# వారికి పట్టాదారు హక్కులు రావు
# అసైన్డ్ భూములపై మంత్రి ధర్మాన కీలక ప్రకటన

రాష్ట్రంలో వైసీపీ సర్కార్ పెద్ద ఎత్తున భూ సంస్కరణలు తీసుకవచ్చిందన్నారు మంత్రి ధర్మాన ప్రసాదరావు. ఈ క్రమంలోనే అసైన్డ్ భూములకు కూడా హక్కులు కల్పించామని చెప్పారు. అనధికారికంగా అసైన్డ్ భూములను కొన్నవారికి హక్కులు రావని స్పష్టం చేశారు. స్వతంత్రం వచ్చే నాటికి భూమిలేని నిరుపేదలు పెద్ద సంఖ్యలో ఉండేవారని అన్నారు ఏపీ రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు. ఇవాళ సచివాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన... పేదలకు భూ పంపిణీ కోసం అనేక చట్టాలు తెచ్చి భూమి పంపిణీ చేశారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ లో 34 వేల మంది పేదలకు భూమి పంపిణీ చేశారని... 20 సంవత్సరాలుగా అసైండ్ భూములను అనుభవంలో ఉన్న ఉంచుకున్న వ్యక్తికి అన్ని హక్కులను ఇచ్చేందుకు క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని తెలిపారు. 1977 లో ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్ ఫర్ యాక్ట్ 77ను తీసుకవచ్చిందని మంత్రి ధర్మాన తెలిపారు. జమిందారులు, భూ స్వాములకు భూమి అమ్మకం జరుగకుండా అడ్డుకొనేందుకు ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్ ఫర్ యాక్ట్ 77 ను తీసుకవచ్చారని వెల్లడించారు. నిరుపేదలకు భూమిని ఇచ్చిన లక్ష్యం నెరవేరదనే ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్ ఫర్ యాక్ట్ 77 ను తెచ్చారని,,,. ఈ చట్టం తెచ్చి 40 సవత్సరాలు అయ్యిందన్నారు. అయితే ఇలాంటి భూముల విషయంలో జగన్ ప్రభుత్వం ఆంక్షలను తెత్తివేయడం అంటే అమ్మ




కాలు చేసుకోమని కాదని.... ఆ భూమిపై సర్వ హక్కులు ఇవ్వడమేనని స్పష్టం చేశారు. సర్కార్ నిర్ణయం కారణంగా ఈ భూమిలో వ్యాపారం చేసుకోవచ్చు.. ఫ్యాక్టరీలు నిర్మించుకోవచ్చు. అవసరాన్ని బట్టి విక్రయం చేసుకోవచ్చన్నారు. అంతకు మందు అనధికారికంగా ఎవరికైనా అసైండ్ భూమి అమ్మి వుంటే కొన్నవారు సొంతం చేసుకొనే వెసులుబాటు లేదన్నారు. అసైండ్ భూమి పట్టాదారునికే సర్వ హక్కులు ఉంటాయని చెప్పుకొచ్చారు. మొత్తం అసైండ్ భూములు 33 లక్షలా 29 వేల ఎకరాలు వున్నాయన్న ధర్మాన.... 19 లక్షలా 21 వేల మంది లబ్దిదారులు ఉన్నారని వివరించారు. "ప్రస్తుతం 20 ఏళ్లుగా అసైండ్ భూములు కలిగిన వారికి ఆ భూములపై సర్వ హక్కులు ఇవ్వడం ద్వారా 17 లక్షలా 21 వేల మందికి లబ్ది చేకూరుతుంది. 27లక్షల 41 వేల ఎకరాలు పేదల సొంతం అవుతాయి. 2013లో జరిగిన పొరపాటు వల్ల సర్వీస్ ఇనాం భూములు అన్నింటిపై ఆంక్షలు పెట్టారు. ఇప్పుడు ఆ ఆక్షలను తొలగించాం. రిజిస్ట్రేషన్ ఫీజులు పెంచడం ద్వారా వచ్చే డబ్బు సంక్షేమ పథకాల అమలుకు ఉపయోగపడుతోంది. భూముల విలువ మార్కెట్ వ్యాల్యూ ఎక్కువగా వుంటోంది. అమ్మకాల్లో బ్లాక్ మనీ ఎక్కువ అవుతోంది. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం. విశాఖపట్నం భూ కుంభకోణంలో సిట్ సమర్పించిన నివేదిక పబ్లిక్ డొమైన్ లో వుంటుంది. కావాలంటే సూసుకోండి. నా పేరు వుందా ? లేదా ? అన్నది తెలుసుంది. భూములను ఇచ్చే అధికారం రెవెన్యూ మంత్రికి ఉండదు. క్యాబినెట్ కు , కలెక్టర్ కు మాత్రమే ఉంటుంది. ఈ భూమలు విషయంలో నా మీద అసత్య ప్రచారం చేస్తున్నారు" అని మంత్రి ధర్మాన కామెంట్స్ చేశారు.

## కాంగ్రెస్ పార్టీ చేపట్టిన భరోసా యాత్రకు

# ప్రజల్లో నుంచి మంచి స్పందన

"కాంగ్రెస్ భరోసా యాత్ర"కు బ్రహ్మరథం పడుతున్న ప్రజలు భరోసా యాత్ర భయంతో ఎమ్మెల్యే డ్రామా యాత్రకాంగ్రెస్ నేత పరమేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన భరోసా యాత్రకు ప్రజల్లో నుంచి మంచి స్పందన లభిస్తుందని ఆ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే నమ్మకానికి మారుపేరు. ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంపొందించడం, వారి భవిష్యత్ కు భరోసాను నింపేందుకే ఈ యాత్ర చేస్తున్నట్టుగా పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. భరోసా యాత్రకు ఉప్పల్ నియోజకవర్గంలో ప్రజలు బ్రహ్మరథం పడుతుంటే.. అది చూసి ఓర్వలేక ఎమ్మెల్యే డ్రామా యాత్ర చేపట్టారని, ఈ డ్రామాలు జనం గమనిస్తున్నారని ఎద్దేవా చేశారు. నాలున్నరేళ్లు నియోజకవర్గంలో ప్రజా సమస్యలను పట్టించుకోని ఎమ్మెల్యేకు ఇప్పుడు ప్రజలు గుర్తు వచ్చారా అంటూ నిలదీశారు. రానున్న ఎన్నికలలో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకే ప్రజలు పట్టం కడుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. హబ్సిగూడ డివిజన్ అధ్యక్షుడు కాలేరు జైనవీన్ ఆధ్వర్యంలో చేపట్టిన కాంగ్రెస్ భరోసా యాత్రకు పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. గాంధీ గిరిజన బస్తీ, తదితర ప్రాంతాలలో భరోసా యాత్ర సాగింది. గిరిజనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలతో మోసం చేస్తున్నాయన్నారు. ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు, రిజర్వేషన్లు పెంపు అమలు కాలేదన్నారు. కాంగ్రెస్



పార్టీ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి, వృద్ధులకు, ఇతర అన్ని రకాల పింఛను దారులకు నెలకు రూ.4వేల చొప్పున పింఛను, స్వయం ఉపాధికి మహిళలకు, యువకులకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధులు మేకల శివ రెడ్డి, తౌఫిక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి,కంది ఆగి రెడ్డి, బోరంపేట కృష్ణ ముదిరాజ్, చెన్రెడ్డి రఘుపతి రెడ్డి, థావీదబోయిన గిరిబాబు, బొపన్నపల్లి సుధాకర్ రెడ్డి, బ్లాక్ ప్రధానకార్యదర్శి సుర్వి మురళి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

---

### నీ బద్ధతతో పని చేస్తున్న కమిషనర్ పై

## రాజకీయ కుట్రలు సరికాదు

**మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు వంగేటి ప్రభాకర్ రెడ్డి**



**జయభేరి, మేడిపల్లి :**

నియమ నిబంధనలకు లోబడి పనిచేస్తున్న పీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ పై రాజకీయ దురుద్దేశంతో నే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని బి.ఆర్.ఎస్ ఎస్ నాయకులపై... మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు వంగేటి ప్రభాకర్ రెడ్డి మండిపడ్డారు. పీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ పై ఇటీవల జరుగుతున్న రాజకీయ కుట్రలపై స్పందించిన వంగేటి చట్టం పరిధిలో నిబద్ధతతో పనిచేస్తున్న కమీషనర్ కి కాంగ్రెస్ పార్టీ మద్దతు ఉంటుందని అన్నారు.పార్కులను కాపాడటంలో కమీషనర్ వ్యవహరిస్తున్న తీరుపై వంగేటి హర్షం వ్యక్తం చేసారు. గతంలో కబ్జాకు గురైన ఎన్నో పార్కులను వెలికి తీసి కాపాడాలని అన్నారు.

---

## బీఆర్ఎస్ నేత శ్రవణ్‌కు అర్ధరాత్రి బెదిరింపు కాల్స్..

**జయభేరి, హైదరాబాద్ :**

రేవంత్ రెడ్డి అనుచరుల మంటూ బెదిరింపు కాల్స్ వచ్చాయని అన్నారు బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్. అర్ధరాత్రి ఫోన్ చేస్తూ .. అంతు చూస్తామంటూ హెచ్చరికలు చేస్తున్నారని వెల్లడించారు. ఇదే విషయాన్ని ఆయన పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఫోన్లో అసభ్య పదజాలం వాడుతూ..రేవంత్ రెడ్డి ని విమర్శిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారని తెలిపారు. హైదరాబాద్ లోని సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్ మరియు సంబంధిత పోలీసు అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన... రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి ఎందుకు ఇంత దిగజారుడుతనానికి పాల్పడుతున్నావు అని దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి భాష వినడానికి కూడా బాధకలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. "బుద్ధిలేదా అని ఎందుకు అనాల్సి వచ్చిందంటే.. తెలంగాణ సాధించి... దేశానికే ఆదర్శంగా అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ను చార్లెస్ శోభరాజ్ అంటావా..? బీసీ నాయకులైన గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ లను అన్న మాటాలకు నీకు బుద్ధి లేదా అని అన్నాను. దానికి నువ్వు దొంగ కాల్స్ చేయించి మమ్మల్ని బెదిరిస్తావా..? బీసీ నాయకులంటే పడతలేదా..?" అని శ్రవణ్ ప్రశ్నించారు. "ఇవాళ దేశానికే తలమానికంగా తెలంగాణను అభివృద్ధి చేస్తుంటే..అది చూసి ఓర్వలేక తండ్రి వయసున్న కేసీఆర్ ని పట్టుకొని చార్లెస్ శోభరాజ్



అంటావా..?ఇలా ఇష్టవచ్చినట్లు కేసీఆర్ ని అంటుంటే..మేము మాత్రం నిన్ను ఏమి అనొద్దా రేవంత్ రెడ్డి...? కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావ్ వాళ్లపై ఇష్టానుసారంగా మాట్లాడుతుంటావ్. మహిళలను వదిలిపెట్టవు.. నాయకులని వదిలిపెట్టవు..వ్యాపారస్తులను వదిలిపెట్టవు ..చిన్న , పెద్ద ఏమిలేదు..ఇష్టం వచ్చినట్లు మాట్లాడతావ్..బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడతావ్. మరో నయీమ్ లెక్క మారావ్. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ని నడుపుతున్నట్లు లేదు ఓ దండుపాళ్యం బ్యాచ్ నడుపుతున్నట్లు ఉంది" అని శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాసోజు శ్రవణ్ కు బెదిరింపు కాల్స్ అంశంపై మంత్రులు కేటీఆర్, హరీశ్ రావ్ స్పందించారు. బెదిరింపు ఘటనలను సీరియస్‌గా తీసుకుని, చట్టపరంగా కఠినంగా వ్యవహరించాలని హోం మంత్రి మహమూద్ అలీ, డీజీపీ అంజనీ కుమార్‌ను కేటీఆర్ కోరారు. ఇక మంత్రి హరీశ్ రావ్ మీడియాతో మాట్లాడుతూ...రాజకీయంగా విమర్శలను ఎదుర్కొలేని స్థితిలో కాంగ్రెస్ ఉందని దుయ్యబట్టారు. రాజకీయంగా ఎదుర్కొలేక... వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ బెదిరింపులకు దిగే పరిస్థితి కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రవణ్ కు బెదిరింపు కాల్స్ చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు.

---

## జిల్లా కలెక్టర్లకే 'దళితబంధు' లబ్ధిదారుల ఎంపిక బాధ్యతలు

**కరీంనగర్ :**

దళితబంధు... హుజురాబాద్ బైపోల్ సమయంలో తీసుకొచ్చిన ఈ స్కీమ్ ను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నారు. తొలి విడతలో భాగంగా... దాదాపు 35వేలకు మందికి అందజేశారు. అయితే స్థానిక ఎమ్మెల్యేలకు లబ్ధిదారుల ఎంపిక బాధ్యతలను అప్పగించటం చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. కేవలం అధికార పార్టీకి చెందిన కార్యకర్తలకే దళితబంధు ఇచ్చారనే ఆరోపణలు వచ్చాయి. ఇదే అంశంపై పలువురు హైకోర్టును కూడా ఆశ్రయించారు. దీనిపై విచారించిన న్యాయస్థానం.... ఎమ్మెల్యేల ప్రమేయంపై కీలక వ్యాఖ్యలు చేసింది. ఎంపిక బాధ్యతలతో వారి ప్రమేయమే ఉండొద్దని స్పష్టం చేసింది. అయితే తాజాగా రెండో విడతకు సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఈసారి కూడా పాత పద్ధతినే పాటిస్తారా...? అలా చేస్తే దరఖాస్తు విధానం ఉంటుందా...? అన్న చర్చ నడుస్తోంది. అయితే వీటిపై క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్. జిల్లా కలెక్టర్లకే లబ్ధిదారుల ఎంపిక బాధ్యతలు అప్పగించనున్నట్లు ప్రకటించారు.

శుక్రవారం కరీంనగర్ లోని క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు మంత్రి కొప్పుల ఈశ్వర్. జిల్లా కలెక్టర్లకే దళితబంధు లబ్ధిదారుల ఎంపిక బాధ్యతలు అప్పగించామని ప్రకటించారు. సంబంధిత జిల్లా మంత్రులు, జిల్లా కలెక్టర్ల తో కలిసి చర్చించి నిర్ణయం తీసుకుంటారని చెప్పుకొచ్చారు. దళితబంధు రెండో విడత కోసం సర్కార్ కేటాయించిన 1700 కోట్ల రూపాయల నిధుల్లో ఇప్పటికే 850 కోట్లు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు , అక్రమాలు జరుగుతున్నట్లు వస్తున్న ఆరోపణల్లో ఎంత మాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. రెండో విడతలో రాష్ట్రవ్యాప్తంగా 1.30లక్షల దళిత కుటుంబాలకు పథకాన్ని అందించాలని సర్కార్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఒక్కో నియోజకవర్గానికి 1,100 మంది చొప్పున హుజూరాబాద్ మినహా మిగతా 118 నియోజకవర్గాలు కలిపి మొత్తం 1,29,800 యూనిట్లను అందించనున్నారు. అర్హత కలిగిన వారిని గుర్తించేందుకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తుందా లేదా అనేది ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో అంటే... నేరుగా ఎంపిక చేస్తారా...? దరఖాస్తులను స్వీకరించి... పరిశీలించిన తర్వాత ప్రకటిస్తారా అనేది అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. దళితబంధు పోర్టల్ ద్వారా ఎంపిక, పరిశీలన, యూనిట్ల మంజూరు ఉంటుందని పేర్కొన్నప్పటికీ.... అధికారికంగా మార్గదర్శకాలు వెలువడని పరిస్థితి ప్రస్తుతం




కనిపిస్తోంది. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు అక్రమాలకు పాల్పడ్డారన్న వార్తలు రావటం... స్వయంగా కేసీఆర్ హెచ్చరించటం వంటివి కూడా జరిగాయి. రెండో విడత దళితబంధు లబ్ధిదారుల ప్రక్రియ ఏ విధంగా ఉండబోతుందనే దానిపై మాత్రం స్పష్టత కరువైందన్న టాక్ వినిపిస్తోంది. అయితే కలెక్టర్లకే బాధ్యతలు అప్పగించినున్నట్లు మంత్రి చెప్పిన నేపథ్యంలో... దరఖాస్తుల విషయంలో స్పషత రావాలి.

---



## అంగరంగ వైభవంగా బోనాల జాతర..!

**జయభేరి, మేడిపల్లి :**

బోనాలకు ముస్తాబవుతున్న పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పర్వతాపురం 5వ డివిజన్ లోని అమ్మవారి ఆలయాలు,జులై 16న అంగరంగ వైభవంగా బోనాల జాతర..!తెలంగాణలో అమ్మవారిని పూజించే ఉత్సవం బోనాల పండుగ. సంస్కృతీ సంప్రదాయాలు కలబోసిన గ్రామదేవతల పండుగిది.రాష్ట్ర పండుగ బోనాల జాతరకు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పర్వతాపురం ముస్తాబవుతోంది.ఈ నెల 16న ఆదివారం బోనాల వేడుకలు జరుపుకొనుటకు 5వ డివిజన్ పరిధిలోని అన్ని అమ్మవారి దేవాలయాలకు రంగులు వేయడం, విద్యుద్దీపాలంకరణ, పరిశుభ్రత, మంచి నీరు, పోలీస్ బందోబస్త్ తో పాటు పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసేవిధంగా స్థానిక కార్పొరేటర్ బొడిగె స్వాతి కృష్ణ గౌడ్ దగ్గరుండి పనులను పర్యవేక్షించి దిశా నిర్దేశం చేయడమైనది. మతసామరస్యానికి.. తెలంగాణ జన జీవన సాంస్కృతిక వైభవానికి ప్రతీకలైన బోనాల పండుగను పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలందరూ అంగరంగ వైభవంగా జరుపుకోవాలని, అమ్మవారి ఆశీస్సులు అందుకోవాలని కోరుకుంటున్నారు.

---



### ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం

## జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు

**వీడియో కాన్ఫరెన్స్ లో వివరించిన**

**మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్అమోయ్ కుమార్**

**జయభేరి, మేడిపల్లి :**

శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి రాష్ట్ర శాసనసభకు జరగబోయే సాధారణ ఎన్నికలపై సమీక్షా సమావేశం 2023 అవగాహన, ఈ.వి.ఎం. లు, వి.వి. ప్యాట్ ల ఉపయోగం కోసం డిజిటల్ ఔట్రీచ్ పై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. అనంతరం మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ మాట్లాడుతూ... రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనల మేరకు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. దీంతో పాటు జిల్లా వ్యాప్తంగా రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికార యంత్రాంగం సిద్దంగా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఈ విషయంలో ముందస్తు కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందని వీడియో కాన్ఫరెన్స్ లో పేర్కొన్నారు. అలాగే ఇప్పటికే ఓటర్లకు ఓటుపై అవగాహనతో పాటు ఈవీఎమ్, వీవీప్యాట్స్ సంబంధించిన వివరాలను తెలియజేస్తున్నామని... గ్రామాల్లో మొబైల్ వ్యాన్ల ద్వారా కూడా ఓటు వేసే విధానం తదితర వివరాలను తెలియచేస్తూ ఓటు హక్కు గురించి అధికారులు వివరిస్తున్నారని కలెక్టర్ అమోయ్ కుమార్ కాన్ఫరెన్స్ లో వివరించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్వో)లు ఇంటింటి సర్వే నిర్వహించి కొత్తగా ఓటర్ల నమోదు ప్రక్రియ చేపడుతున్నారని తెలిపారు. అదే సమయంలో ఓటర్లకు సంబంధించి మార్పులు, చేర్పులు, రెండు చోట్ల ఓటు ఉంటే ఓటర్లు కోరిన చోట ఒకే ఓటు ఉండేలా చూస్తున్నామని... డూప్లికేట్ ఓట్లు లేకుండా సంబంధిత అధికారులు తమ విధులు నిర్వహిస్తున్నారని కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ లో తెలిపారు. దీంతో పాటు జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని... స్వీప్ యాక్టివిటీలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే అన్ని రకాల ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని కలెక్టర్ అమోయ్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ లో వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి చంద్రావతి, ఎన్నికల సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

---



**మేడ్చల్ జిల్లా! పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వరంగల్ జాతీయ హైవే రోడ్డుకి అనుకొని.. పిల్లర్ నంబర్ 55 ఎదురుంగా స్వదేశీ హోటల్ లో దారుణం. ఒక కుటుంబ సభ్యులు తినడానికి వస్తే అనుకోకుండా జున్ను ఆర్డర్ ఇచ్చారు. దాన్ని తింటుంటే అందులో ఒక పురుగు, బుజ్జు లభించాయి. దీనిపై ప్రజలు ఆగ్రహం చెందుతున్నారు. పలువురు యజమాన్యాన్ని, సిబ్బందిని ప్రశ్నిస్తే మీరు ఏం చేసుకుంటరో చేసుకోండి... ఈ ఒక్కసారి క్షమించండి అని నిర్లక్ష్యంగా చెబుతున్నారు సిబ్బంది.**

**.... జయభేరి, మేడిపల్లి**

ప్రభాత జయభేరి
jayabheridaily.com



## మాన్‌సూన్‌లో పిల్లల ఆరోగ్యం కోసం నిపుణుల సలహాలు ఇవిగో!

వర్షాకాలం అంటే పిల్లలకు చాలా ఇష్టం ఉంటుంది, వర్షాన్ని చూస్తూ కేరింతలు కొడతారు, వర్షపు నీటిలో ఆటలు ఆడతారు, వీధుల్లో లభించే చిరుతిళ్లు తినడానికి ఇష్టపడతారు, చివరకు జబ్బుపడతారు. దగ్గు, జలుబు, జ్వరం వంటివి తెచ్చుకుంటారు. వీటికి తోడు ఈ సీజన్‌లో ప్రబలే అంటువ్యాధులు, దోమల ద్వారా వ్యాప్తి చెందే ఇన్ఫెక్షన్లు పిల్లలను తీవ్ర అనారోగ్యాలకు గురిచేస్తాయి. వర్షాకాలంలో పిల్లలను నియంత్రించడం, వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం తల్లిదండ్రులకు కత్తిమీద సాము అవుతుంది. మాన్‌సూన్‌లో పిల్లల ఆరోగ్యం కోసం ప్రత్యేక శ్రద్ధ అవసరం. ఈ సీజన్‌లో పిల్లలు అనారోగ్యాల బారిన పడకుండా ఉండేందుకు వారిలో రోగనిరోధక శక్తిని పెంచాలి. వారు తినే ఆహారం దగ్గర్నించీ, వారికి అందించాల్సిన వైద్యం, వారి జీవనశైలిలో మార్పులు ఇలా ప్రతీది ప్రత్యేకంగా ఉండాలి. ఇందుకోసం ఫేత్ క్లినిక్‌లో పీడియాట్రిషియన్, అడోలెసెంట్ స్పెషలిస్ట్ డాక్టర్ పౌలా గోయెల్ కొన్ని చిట్కాలు అందించారు. అవేంటో ఇక్కడ తెలుసుకోండి.

**ఆరోగ్యకరమైన ఆహారం ఇవ్వండి**

పిల్లలు తరచుగా రుచిగా లేదని ఆరోగ్యకరమైన ఆహారం తినేందుకు ఇష్టపడరు. అదే సమయంలో బయట నోరూరించే వంటకాల కోసం పాకులాడతారు. కానీ, తల్లిదండ్రులు దీనిని నివారించాలి. పిల్లలు ఇంట్లో వండిన ఆహారం తినేలా జాగ్రత్తపడాలి. పిల్లలు ఇష్టపడే విధంగా ఆరోగ్యకరమైన ఆహారాల రెసిపీలతో ప్రయోగాలు చేస్తూ వారికి తినిపించాలి. పండ్లు, కూరగాయలు మొదలైన పోషకాలు పుష్కలంగా ఉండే ఆహారాలను తినిపించండి.

**రోజూ వ్యాయామం చేయించండి**

కదలకుండా కూర్చోవడం మన జీవితంలో విలన్‌గా మారింది. నిష్క్రియాత్మకమైన జీవనశైలి కారణంగా ఆరోగ్యం చెడిపోతుంది. కాబట్టి మీ పిల్లలకు కొంత శారీరక శ్రమ కల్పించండి. వారు క్రమం తప్పకుండా వ్యాయామం చేసేలా ప్రేరేపించండి. వాతావరణం బాగున్నప్పుడు బహిరంగ ప్రదేశాలలో వివిధ కార్యకలాపాలలో పాల్గొనేలా ప్రోత్సహించాలి. బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంటే ఇంట్లోనే వారితో స్కిప్పింగ్, హాపింగ్, డక్ వాకింగ్ వంటి ఏరోబిక్ వ్యాయామాలను చేయించండి.

**ఒత్తిడిని తగ్గించండి**

పిల్లలకు వర్షాకాలంలో పాఠశాలలకు వెళ్ళడం, వేసవి సెలవుల తరువాత మళ్లీ కొత్తగా చదవడం ప్రారంభించాలంటే అయిష్టత ఉంటుంది. దీని గురించి వారు ఒత్తిడికి గురవుతారు. కాబట్టి వారిపై విద్యాపరమైన లేదా మరే ఇతర ఒత్తిడిని పెట్టకుండా జాగ్రత్తపడండి. వారి ఒత్తిడిని తగ్గించడానికి మీ వంతు ప్రయత్నం చేయండి.

**టీకాలు వేయించండి**

చికిత్స కంటే నివారణ, వ్యాధి నిరోధకత ఉత్తమం. కాబట్టి మీ పిల్లలకు వారి వయస్సు ప్రకారంగా అవసరమైన అన్ని టీకాలను వేయించండి. వార్షిక ఇన్‌ఫ్లుఎంజా వ్యాక్సిన్‌ను వేయించండి. సీజనల్ ఇన్ఫెక్షన్లను నివారించే టీకాలు, అవసరమయ్యే ఇతర వైద్య సహాయాలను వారికి అందించండి.

---



## పాదాల అందానికైనా .. హాట్ స్టోన్ పెడిక్యూర్!

మాన్‌సూన్ సీజన్‌లో ప్రతి ఒక్కరు తమ పాదాల సంరక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పాదాల సంరక్షణ విషయానికి వస్తే, పురుషుల కంటే మహిళలు ఎంతో శ్రద్ధ కనబరుస్తారు. తరచుగా పార్లర్‌కి వెళ్లి చక్కగా పెడిక్యూర్ చేయించుకుంటారు. అయితే కేవలం పాదాల అందాన్ని కాపాడటమే కాకుండా, మీరు చేసుకునే పెడిక్యూర్ మీకు పలు ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తే ఇంకా బాగుంటుంది కదా? మరి అటువంటి పెడిక్యూర్ గురించి మీకు తెలుసా? అలాంటి ఒక పెడిక్యూర్ పేరు హాట్ స్టోన్ పెడిక్యూర్.

హాట్ స్టోన్ పెడిక్యూర్ అనేది పాదాల డెడ్ స్కిన్ సెల్స్‌ను క్లీన్ చేసి, మీ పాదాలను మెరిసేలా చేస్తుంది. ఇది మాత్రమే కాదు ఈ హాట్ స్టోన్ పెడిక్యూర్ మీకు పాదాల నొప్పి నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుంది, దీనితో మీ నరాలు కూడా రిలాక్స్ అవుతాయి. హాట్ స్టోన్ పెడిక్యూర్ ఎలా చేస్తారు, దీని వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

**హాట్ స్టోన్ పెడిక్యూర్ అంటే ఏమిటి? :** హాట్ స్టోన్ పెడిక్యూర్ చేసేటప్పుడు పాదాలకు సౌకర్యంగా ఉండేందుకు నునుపైన, గుండ్రని చిన్న సైజు రాళ్లను ఉపయోగిస్తారు. ఈ రాళ్లను కొద్దిగా వేడి చేసి మీ పాదాలకు మసాజ్ చేస్తారు. హాట్ స్టోన్ పెడిక్యూర్‌లో, పాదాలకు క్రీమ్‌కు బదులుగా నూనెతో మసాజ్ చేస్తారు. ఈ హాట్ స్టోన్ పెడిక్యూర్ మీ పాదాలను చాలా మృదువుగా, శుభ్రంగా మార్చడంలో సహాయపడుతుంది. మీకు పాదాలు నొప్పులు లేదా పగుళ్లు ఉన్నట్లయితే, హాట్‌స్టోన్ పెడిక్యూర్ మీకు గొప్ప ఎంపిక. హాట్ స్టోన్ పెడిక్యూర్ చేసుకుంటే మీరు పొందే కొన్ని ప్రయోజనాలు ఈ కింద చూడండి.

**కాలి కండరాలు రిలాక్స్ అవుతాయి :** హాట్ స్టోన్ పెడిక్యూర్ మీ పాదాల కండరాలను సడలిస్తుంది, దీని కారణంగా మీరు పాదాల నొప్పి నుండి చాలా ఉపశమనం పొందుతారు. ఇది మీకు హాయి గొలిపే అనుభూతితో పాటు, కాళ్లలో నొప్పుల, పాదాల పగుళ్ల మంట నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

**మెరుగైన రక్త ప్రసరణ :** హాట్ స్టోన్ పెడిక్యూర్ సమయంలో మసాజ్ చేయడం వల్ల శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఇది పాదాల వాపును తగ్గించి రక్త ప్రసరణను పెంచడంలో సహాయపడుతుంది. హాట్ స్టోన్ పెడిక్యూర్ చేసుకోవడం ఒత్తిడి, ఆందోళనను తగ్గించడంలో సహాయపడుతుంది.

**ఆర్థరైటిస్ చికిత్స :** పాదాలకు హాట్ స్టోన్ పెడిక్యూర్ చేసే సమయంలో రాయి నుండి వెలువడే వేడి పాదాలలో నొప్పిని, అసౌకర్యాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది. అరికాలి ఫాసిటిస్ లేదా ఆర్థరైటిస్ వంటి పరిస్థితులకు చికిత్స చేయడానికి హాట్ స్టోన్ పెడిక్యూర్‌లు కూడా మంచి చికిత్స విధానాలుగా ఉంటాయి.

**చర్మానికి ఎక్స్‌ఫోలియేషన్ :** హాట్ స్టోన్ పెడిక్యూర్ చేసేటప్పుడు ఎక్స్‌ఫోలియేషన్ చేయడం వల్ల చర్మం మృత చర్మ కణాలను శుభ్రపరచవచ్చు, తద్వారా పాదాల చర్మం, ఆకృతిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

**మంచి నిద్ర :** మీకు నిద్ర పట్టడంలో ఇబ్బంది ఉంటే, మీరు ఒకసారి హాట్ స్టోన్ పెడిక్యూర్ చేయించుకొని చూడండి. రాత్రి పడుకునే ముందు హాట్ స్టోన్ పెడిక్యూర్ చేయడం వల్ల మంచి నిద్రను ప్రేరేపిస్తుంది. కొన్ని అధ్యయనాలు వేడి రాతితో పాదాలకు చేసే చికిత్స, మసాజ్ చేయడం వల్ల ఒత్తిడిని తగ్గించి, రిలాక్స్‌గా ఉంచుతుంది. తద్వారా బాగా నిద్రపోయేలా సహాయపడుతుంది.

## వర్షా కాలంలో జబ్బుపడితే అందుకు కారణాలు ఈ రెండే, తెలుసుకోండి!

వర్షాకాలంలో ప్రధానంగా దోమలు, ఈగలు, కీటకాలు మొదలైన వెక్టర్‌ల ద్వారా సంక్రమించే వ్యాధులు, అలాగే నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు ప్రబలంగా ఉంటాయి. మాన్‌సూన్ సీజన్‌లో కురిసే ఎడతెగని వర్షాలతో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతుంది, అధిక తేమతో కూడిన వాతావరణం కారణంగా దోమల వృద్ధికి అవకాశం ఏర్పడుతుంది, ఈ దోమలు అనేక వైరల్ ఇన్ఫెక్షన్లను కలిగిస్తాయి.

మరోవైపు వర్షాకాలంలో నీరు కూడా కలిషితం అవుతుంది. దీంతో కలుషితమైన నీరు తాగడం ద్వారా టైఫాయిడ్, కలరా, లెప్టోస్పిరోసిస్ వంటి వ్యాధులు వస్తాయి. ఈ ప్రకారంగా, వర్షాకాలంలో ప్రధానంగా దోమలు, ఈగలు, కీటకాలు మొదలైన వెక్టర్‌ల ద్వారా సంక్రమించే వ్యాధులు, అలాగే నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు ప్రబలంగా ఉంటాయి. కాబట్టి ఎవరైనా ఈ సీజన్‌లో జబ్బు పడినట్లయితే అది వెక్టర్‌ల ద్వారా కలిగిన అనారోగ్యమా, లేక నీటి ద్వారా తలెత్తిన ఆరోగ్య సమస్యనా? అనేది తెలుసుకోవడం ముఖ్యం అని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. లక్షణాలలో వ్యత్యాసం తెలిసినపుడు చికిత్స సులభం అవుతుంది, వేగంగా కోలుకోవచ్చని చెబుతున్నారు. నవీ ముంబయిలోని అపోలో హాస్పిటల్స్‌లో కన్సల్టెంట్ డాక్టర్ అయినటువంటి డాక్టర్ వైశాలి లోఖండే, మాన్‌సూన్ సీజన్‌లో సాధారణంగా సంక్రమించే వ్యాధుల లక్షణాలు, సంకేతాల గురించి వివరించారు.

**వెక్టర్ ద్వారా సంక్రమించే వ్యాధులు**

దోమలు, ఈగలు, ఇతర కీటకాల ద్వారా వ్యాధులు వ్యాపిస్తాయి. ఇవి బ్యాక్టీరియా, వైరస్‌లు లేదా వ్యాధులకు కారణమయ్యే పరాన్నజీవులను మోసుకొస్తాయి. దోమ కుట్టినపుడు లేదా కీటకం కాటు వలన ఈ పరాన్న జీవులు మన శరీరంలోకి చేరతాయి. అప్పుడు మలేరియా, డెంగ్యూ జ్వరం, జికా వైరస్, లైమ్ వ్యాధి, చికున్‌గున్యా వంటివి అనారోగ్యాలను కలిగిస్తాయి. ఇవి వెక్టర్ ద్వారా సంక్రమించే వ్యాధులకు ఉదాహరణలు.

**వెక్టర్ ద్వారా సంక్రమించే వ్యాధుల లక్షణాలు**

నిర్దిష్ట వ్యాధిని బట్టి లక్షణాలు మారవచ్చు, కానీ కొన్ని సాధారణ లక్షణాలు మాత్రం ఒకేలా ఉంటాయి. జ్వరం వస్తుంది, అనేక వెక్టర్ ద్వారా సంక్రమించే వ్యాధులు అధిక జ్వరంను కలిగిస్తాయి. శరీర నొప్పులు, కీళ్ల నొప్పులు ఉంటాయి. కండరాలు, కీళ్లలో నొప్పి తరచుగా గమనించవచ్చు. చర్మపు దద్దుర్లు కనిపిస్తాయి, ఇతర చర్మ సమస్యలకు కారణం కావచ్చు. తల నొప్పి ఉంటుంది. తరచుగా వచ్చే తలనొప్పి ఒక సాధారణ లక్షణం. అలసట లేదా బలహీనమైన అనుభూతి కలుగుతుంది, శోషరస కణుపులు ఉండవచ్చు. కొన్ని సందర్భాల్లో జీర్ణశయాంతర లక్షణాలు సంభవించవచ్చు. అంటే వికారం, వాంతులు ఉండవచ్చు. కొన్ని సందర్భాల్లో, దగ్గు లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి శ్వాసకోశ లక్షణాలు ఉండవచ్చు.



**నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు**

బ్యాక్టీరియా, వైరస్‌లు లేదా పరాన్నజీవులు వంటి వ్యాధికారక సూక్ష్మజీవుల ద్వారా కలుషితమైన నీటిని తాగడం లేదా ఆ నీటిలో ఆడటం వంటివి చేయడం వల్ల నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు వస్తాయి. ఈ కలుషితాలు త్రాగునీరు, కలుషితమైన నీటిలో ఈత కొట్టడం లేదా కలుషితమైన నీటితో కడిగిన ఆహారం తీసుకోవడం ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తాయి. కలరా, టైఫాయిడ్ జ్వరం, గియార్డియాసిస్, హెపటైటిస్ A. మొదలైనవి నీటి ద్వారా వచ్చే వ్యాధులకు ఉదాహరణలు.

**సంకేతాలు, లక్షణాలు**

నీటి ద్వారా సంక్రమించే హెపటైటిస్ కేసులలో, కొద్దికాలం పాటు జ్వరం, అనారోగ్యం, ఒళ్లు నొప్పులతో పాటు చర్మం, కళ్ళు, మూత్రం పసుపు రంగులోకి మారడం, వికారం, వాంతులు, ఆకలిని కోల్పోవడం వంటివి ఉండవచ్చు. అయితే, టైఫాయిడ్‌లో జ్వరం, తలనొప్పి, బలహీనత మాత్రమే లక్షణాలు కనిపిస్తాయి. నిర్దిష్ట వ్యాధిని బట్టి నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల సంకేతాలు, లక్షణాలు మారవచ్చు, కానీ కొన్ని సాధారణ లక్షణాలను బట్టి అది కలుషిత నీరు వలన కలిగిన అనారోగ్యంగా నిర్ధారించవచ్చు. నీటి ద్వారా వచ్చే వ్యాధులు సాధారణంగా జీర్ణ వ్యవస్థను ప్రభావితం చేస్తాయి, ఇది అతిసారం, కడుపు నొప్పి, తిమ్మిరి, వికారం వంటి లక్షణాలకు దారితీస్తుంది. కొన్నిసార్లు వాంతులు, విరేచనాలు కూడా కలిగిస్తాయి.

## మాన్‌సూన్‌లో ఈ టిప్స్ పాటించండి.. ఫిట్‌గా ఉండండి!

వర్షాకాలంలో ఎలాంటి వ్యాయామం చేయాలి, ఎలా ఫిట్‌గా ఉండాలో నిపుణులు కొన్ని చిట్కాలను సూచించారు. అవి ఇక్కడ తెలుసుకోండి. వర్షాకాలంలో వాతావరణం ఆహ్లాదకరంగా మారుతుంది కానీ, ఈ సీజన్ వ్యాయామం చేసేవారికి అంత అనుకూలంగా ఉండదు. వర్షం కారణంగా నేలంతా చిత్తడిగా మారడం, ఉదయం పూట వర్షాలు కురివడం వలన ప్రత్యేకంగా అవుట్‌డోర్ వర్కవుట్‌లలో నిమగ్నమయ్యే వారికి ఇది సవాలుగా మారుతుంది. ఈ కారణంగా క్రమబద్ధంగా సాగుతున్న తమ వ్యాయామాలకు అంతరాయం కలుగుతుంది. ఫలితంగా ఫిట్‌నెస్ చెడిపోతుంది. అయితే వర్షాకాలంలో తమని తాము ఫిట్‌గా ఉంచుకోవడానికి ఎల్లప్పుడూ ప్రత్యామ్నాయ మార్గాలతో సిద్ధంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. హెచ్‌టి లైఫ్‌స్టైల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో అపోలో స్పెక్ట్రా హాస్పిటల్స్‌లోని కన్సల్టెంట్ బేరియాట్రిక్, లాపరోస్కోపిక్ సర్జన్ అయినటువంటి డాక్టర్ అపర్ణ గోవిల్ భాస్కర్ వివిధ విషయాలు చర్చించారు. వర్షాకాలంలో రాబోయే 2 నెలల కోసం ఎలాంటి వ్యాయామం చేయాలి, ఎలా ఫిట్‌గా ఉండాలో కొన్ని చిట్కాలను సూచించారు. అవి ఇక్కడ తెలుసుకోండి.



**1. ఇండోర్ వ్యాయామాలు ఎంచుకోండి**

వర్షంలో బయటకు వెళ్ళలేని పరిస్థితి ఉంటే ఆరోజు ఇంటో ఉండే చేసుకోగల ఇండోర్ వ్యాయామాలు చేస్తుండాలి. అనేక ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు ఇండోర్ వర్కౌట్‌ల క్లాసులు ఉచితంగా అందిస్తున్నాయి. ఆన్‌లైన్ లోనే చూస్తూ జుంబా డ్యాన్స్ చేయడం, యోగాసనాలు వేయడం చేయవచ్చు, రెసిస్టెన్స్ బ్యాండ్‌లు, డంబెల్స్, కెటిల్ బెల్స్, స్కిప్పింగ్ రోప్, స్టెప్పర్ వంటి వర్కౌట్ ప్రాప్‌లను ఉపయోగిస్తూ వివిధ వర్కౌట్లు చేయవచ్చు. మీకు పెద్ద స్థలం ఉంటే, మీరు ట్రెడ్‌మిల్, స్టాటిక్ సైకిల్ లేదా ట్రామ్పోలిన్‌లో మీ సెషన్ పూర్తిచేయవచ్చు. ఇవేవీ కుదరకపోయినా, మీ ఇంటి చుట్టూ అందుబాటులో ఉన్న స్థలాన్ని ఉపయోగించుకోండి. నడవడం, మెట్లు ఎక్కడం దిగడం చేయవచ్చు. సాయంత్రం వేళ స్విమ్మింగ్, స్క్వాష్, బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్, మార్షల్ ఆర్ట్స్ వంటి ఇండోర్ స్పోర్ట్స్ యాక్టివిటీలలో పాల్గొనవచ్చు.

**2. మీకు నచ్చినది చేయండి**

మీరు వర్కవుట్‌ని ఎంచుకునే సమయంలో, మీరు ఇష్టపడేదాన్ని ఎంచుకుని, ఆనందించండి. మీరు వ్యాయామం చేస్తున్నప్పుడు సరదాగా ఉంటే, అది మీ ఫిట్‌నెస్ స్థాయిని మాత్రమే కాకుండా మీ మానసిక ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది.

**3. హైడ్రేటెడ్ గా ఉండండి**

వర్షాకాలంలో చాలా ఎండగా ఉండకపోయినా తేమ కారణంగా శరీరం నుండి చాలా నీరు నష్టం జరుగుతుంది. మీ శరీరంలో నీటి అవసరాలను తీర్చడానికి శుద్ధమైన నీరు, కొబ్బరి నీరు, నిమ్మకాయ పానీయం, మజ్జిగ, సూప్‌లు/ వెజ్ జ్యూస్‌లు మొదలైనవి తీసుకోవచ్చు. ఇవి మిమ్మల్ని హైడ్రేట్ చేస్తాయి, నిర్జలీకరణం కారణంగా తలెత్తే తిమ్మిరి, తలనొప్పి, అలసటను నివారిస్తాయి.

**4. సమతుల్య ఆహారం తీసుకోండి**

వర్షాకాలంలో ఇంట్లో వండిన భోజనం తినడానికి మాత్రమే మొదటి ప్రాధాన్యతను ఇవ్వండి. పండ్లు, కూరగాయలతో కూడిన , సమతుల్య ఆహారాన్ని తీసుకోండి. బేకరీ ఆహారాలు, వేయించిన ఆహారాలు, స్వీట్లు, చాక్లెట్లు, చక్కెర పానీయాలు వంటి క్యాలరీలు అధికంగా ఆహారాలకు దూరంగా ఉండండి, ఆరోగ్యకరమైన స్నాక్స్ తినండి.

**5. ట్రెక్కింగ్‌కు వెళ్లండి**

వర్షాకాలంలో కచ్చితంగా చేయాల్సిన అడ్వెంచర్ యాక్టివిటీలలో ట్రెక్కింగ్ కు వెళ్ళడం కూడా ఒకటి. ట్రెక్కింగ్ అనేది మంచి కార్డియో యాక్టివిటీ, ఇది మీ హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది, మనసుకు ఉల్లాసాన్ని పంచుతుంది. శరీరాన్ని ఫిట్‌గా ఉంచుతుంది. కాబట్టి ఈ వర్షాకాలంలో సోలోగా అయినా, గ్రూప్ గా అయినా కొన్ని ట్రెక్‌లను ప్లాన్ చేయండి, ప్రకృతిని ఆస్వాదించండి.

## మాన్‌సూన్‌లో మిమ్మల్ని వెచ్చగా ఉంచే ఆరోగ్యకరమైన టీ రెసిపీలు!

ఈ వర్షాకాలంలో ఆరోగ్యంగా ఉండేందుకు ఒక కప్పు వేడి టీ తాగేందుకు వెనకాడకండి. మీరు ప్రయత్నించగల కొన్ని రకాల టీ రెసిపీలు ఇక్కడ చూడండి. మాన్‌సూన్ అంటే మండుతున్న వేడి నుండి ఉపశమనం. కానీ ఇది అనేక ఆరోగ్య సమస్యలను, వ్యాధులను కూడా ఆహ్వానిస్తుంది. వర్షాకాలం వచ్చిందంటే దగ్గు, జలుబుతో పాటు టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు తరుముకొస్తాయి. అదనంగా చర్మ వ్యాధులు, జీర్ణ సమస్యలు ఉంటాయి. వీటన్నింటి మధ్య ఒక మంచి విషయం ఏమిటంటే, ఈ సీజన్ లో మనం తీసుకునే కొన్ని ఆహారాలు, పానీయాలు కూడా కొన్ని వ్యాధుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఒక కప్పు వేడివేడి టీ తాగటం ద్వారా కూడా మనం అనారోగ్యాలను దూరం చేసుకోవచ్చు. కాబట్టి ఈ వర్షాకాలంలో ఆరోగ్యంగా ఉండేందుకు ఒక కప్పు వేడి టీ తాగేందుకు వెనకాడకండి. మీరు ప్రయత్నించగల కొన్ని రకాల టీ రెసిపీలు ఇక్కడ చూడండి.

**అల్లం టీ**

అల్లం టీ రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరచడంలో, జీర్ణ సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది, వర్షాకాలంలో తప్పకుండా తాగాల్సిన టీ ఇది. 1 tsp అల్లం, 2 స్పూన్ తేనె, 2 లవంగాలు, 1అంగుళం దాల్చిన చెక్క.

**తయారీ విధానం:** ముందుగా ఒక కప్పు నీటిని మరిగించండి. ఆపై అందులో పైన పేర్కొన్న అన్ని పదార్థాలను వేయండి. చల్లారడానికి 15 నిమిషాలు ఉంచి, ఆపై ఒక కప్పులో వడకట్టి ఈ గోరువెచ్చగా టీని త్రాగాలి.

**తులసి టీ**

తులసి మీ రోగనిరోధక శక్తిని పెంచే ఒక అద్భుతమైన మూలిక. ఇది శరీరంలోని హానికర క్రిములతో పోరాడుతుంది, చర్మ వ్యాధులను నయం చేయడంలో సహాయపడుతుంది. 1/4 కప్పు తులసి ఆకులు, 1 స్పూన్ తేనె, 2 స్పూన్ నిమ్మరసం.

**తయారీ విధానం:** ముందుగా తులసి ఆకులను పావు కప్పు నీళ్లతో కలిపి మరిగించండి. ఒక మరుగు తీసుకుని, ఆ తర్వాత ఈ నీటిని ఒక కప్పులో వడకట్టి, ఆపై తేనె, నిమ్మరసం కలుపుకొని తాగాలి.

**పుదీనా టీ**

పుదీనా టీ చాలా రిఫ్రెషింగ్ గా ఉంటుంది. వర్షాకాలంలో సాధారణంగా తలెత్తే కడుపు నొప్పి, ఉబ్బరం వంటి సమస్యలకు ఈ టీ తాగితే ఉపశమనం లభిస్తుంది. కొన్ని పుదీనా ఆకులు, 1 రెమ్మ రోజ్మరీ, నిమ్మరసం రుచికి.



**తయారీ విధానం:** ముందుగా ఒక పాన్ లో నీటిని మరిగించండి. అందులో రోజ్మెరీ వేసి ఉడికించండి. ఆ తర్వాత ఒక కప్పులో పుదీనా ఆకులను చించి వేయండి. ఇప్పుడు రోజ్మరీతో మరిగించిన నీటిని పుదీనా ఆకులు ఉన్న కప్పులో పోయండి. పది నిమిషాలు అలాగే ఉంచాలి. చివరగా నిమ్మరసం పిండుకొని తాగాలి.

# అదే జరగకపోతే రాజకీయ సన్యాసమే పార్టీ మార్పుపై రాజాసింగ్



బీజేపీ నుంచి సస్పెండ్ అయిన ఎమ్మెల్యే రాజాసింగ్... మంత్రి హరీశ్ రావుతో భేటీ కావటం చర్చనీయాంశంగా మారింది. ఆయన బీఆర్ఎస్ లో చేరుతున్నారంటూ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో... రాజాసింగ్ పార్టు మార్పు అంశం మరోసారి తెరపైకి వచ్చినట్లు అయింది. అయితే వీటిపై క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు రాజాసింగ్. బీఆర్ఎస్ లోకి వెళ్తున్నానంటూ తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ బదులిచ్చారు. తాను బీజేపీని వదలి ఏ పార్టీలోకి వెళ్లనని స్పష్టం చేశారు. తనపై విధించిన సస్పెన్షన్‌ను పార్టీ అధినాయకత్వం ఎత్తివేయకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానంటూ కీలక ప్రకటన చేశారు. ఇక మంత్రి హరీశ్ రావును కలవటంపై కూడా క్లారిటీ ఇచ్చారు రాజాసింగ్.ధూల్‌పేటలో మోడల్ ఆస్పత్రి ఏర్పాటు విషయంపై చర్చించేందుకే వెళ్లానని స్పష్టం చేశారు. తన నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసమే హరీశ్ రావును కలిశానన్నారు. తాను చివరి వరకు బీజేపీలోనే ఉంటానని... పార్టీ సస్పెన్షన్ ఎత్తివేయకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని వ్యాఖ్యానించారు. కొద్దిరోజుల కిందట కూడా రాజాసింగ్... తెలుగుదేశంలోకి వెళ్తారనే చర్చ నడించింది. ఈ వార్తలను అప్పట్లో తీవ్రంగా ఖండించారు రాజాసింగ్. తన ఆలోచనలకు ఏ పార్టీ సెట్ కాదని... కేవలం బీజేపీనే సెట్ అవుతుందన్నారు.

ఎమ్మెల్యే ఠాకూర్ రాజాసింగ్ లోధ్ .... ఆయన ఓ వార్నింగ్ ఇస్తే పెద్ద రచ్చ జరగాల్సిందే..! గోరక్ష పేరుతో స్వయంగా అతనే రంగంలోకి దిగుతుంటారు..! హిందూ ధర్మ రక్షణే తన ధ్యేయం అంటూ దూకుడుగా ముందుకెళ్తుంటారు. శ్రీరామనవమి వస్తే... రాజాసింగ్ తలపెట్టే శోభాయాత్ర ఓ రేంజ్ లోనే ఉంటుంది. ఇందుకోసం భారీస్థాయిలో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేస్తుంటారు. మహ్మద్ ప్రవక్తపై రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర దుమారానికి దారితీశాయి. దీంతో ఆయనపై పార్టీ సస్పెన్షన్ విధించిన సంగతి తెలిసిందే. అప్పట్నుంచి... ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. సొంతంగానే నియోజకవర్గంలో తిరుగుతున్నారు.

రాజాసింగ్ రాజకీయ ప్రవేశం కూడా ఆసక్తికరంగానే ఉంటుంది. గో సంరక్షణ, హిందూ వాహిని సభ్యుడిగా ఎంట్రీ ఇచ్చిన ఆయన... శ్రీరామనవమి, హనుమాన్ శోభాయాత్రల నిర్వహణతో వెలుగులోకి వచ్చారు. అయితే రాజాసింగ్ పొలిటికల్ ఎంట్రీ ఇచ్చింది మాత్రం తెలుగుదేశంతో కావటం ఆసక్తికరం. గతంలో టీడీపీ అభ్యర్థిగా మంగళహాట్ నుంచి పోటీ చేసి కార్పొరేటర్‌గా గెలిచారు. ఆ తర్వాత బీజేపీలో చేరిన ఆయన... 2014, 2018లో మంగళ్‌హాట్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2018 ఎన్నికల్లో బీజేపీ నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే రాజాసింగ్. దీంతో శాసనసభా పక్ష నాయకుడిగానూ ఎన్నికయ్యారు. 2015లో ఓ పోలీస్ కానిస్టేబుల్ పై దాడి చేశారు రాజాసింగ్. అర్ధరాత్రి డీజే నిర్వహణను పోలీసులు ఆపివేసిన క్రమంలో ఈ ఘటన జరిగింది. దీనిపై రాజాసింగ్ పై కేసు నమోదైంది. ఇక 2015లో మరో వివాదానికి తెరలేపారు రాజాసింగ్. ఓయూలో బీఫ్ ఫెస్టివల్ ను అడ్డుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. దీనికి వ్యతిరేకంగా పిగ్ ఫెస్టివల్ కూడా నిర్వహిస్తామంటూ ప్రకటన ఇవ్వటం అప్పట్లో పెద్ద దుమారమే రేపింది. 2018 ఎన్నికల అఫిడవిట్ లో రాజాసింగ్ పేర్కొన్న వివరాలపై ప్రకారం... అతనిపై మొత్తం 43 కేసులు నమోదయ్యాయి. ఇందులో అత్యధికంగా విద్వేషపూరిత ప్రసంగాల విషయంలోనే నమోదైనవిగా ఉన్నాయి. మరోవైపు రాజాసింగ్‌ను రెండేళ్ల క్రితం ప్రమాదకరమైన వ్యక్తిగా ఫేస్‌బుక్ లేబుల్ చేసింది. ఫేస్‌బుక్ ఫ్లాట్ ఫారం నుంచి తొలగించింది.

హైదరాబాద్‌లో నిర్వహించిన స్టాండప్ కమెడియన్ మునావర్ ఫారూఖీ కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి రాజాసింగ్ ఆందోళన నిర్వహించారు. దీంతో ఆయనను అరెస్టు చేసి తర్వాత విడుదల చేశారు. 2022 ఏప్రిల్‌లో శ్రీరామనవమి శోభాయాత్ర సందర్భంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినందుకు ఆయనపై కేసు నమోదైంది. హైదరాబాద్‌లో మునావర్ ఫరుఖీ షో సందర్భంగా రాజాసింగ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ షో వేదికను తగలబెడతానని హెచ్చరికలు చేసిన నేపథ్యంలో... పోలీసులు అతడిని అరెస్ట్ చేసి కేసులు నమోదు చేశారు. మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసి దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యారు రాజాసింగ్. ఆయనపై తెలంగాణలోని పలుచోట్ల కేసులు నమోదయ్యాయి. రాజా సింగ్ వ్యాఖ్యలను సీరియస్ గా పరిగణించిన బీజేపీ అధిష్టానం ఆయనకు గట్టి షాక్ ఇచ్చింది. పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



## బాకీ ఉన్న వ్యక్తిని చంపేందుకు కుట్ర

**జయభేరి, కుషాయిగూడ:**

మల్కాజిగిరి డిసిపి డి జానకి, ఎస్ ఓ టి డిసిపి గిరిధర్ రావుల, కుషాయిగూడ ఏసిపి వెంకట్ రెడ్డి లు శుక్రవారం చర్లపల్లి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం శివపురి డిస్ట్రిక్ట్, ఆకాజ్హిరి గ్రామానికి చెందిన యోగేంధర్ రాజ్ పుత్ (39) 2007లో హైదరాబాద్ వచ్చి కుశాల్ లాజిస్టిక్స్ లో డ్రైవర్ గా పనిచేశాడు. 2018 లో కొండాపూర్ లో యోగిరాజ్ సెక్యూరిటీ సర్వీసెస్ ఏజెన్సీ నీ స్థాపించి పలు ప్రాంతాల్లో సెక్యూరిటీ గార్డులను నియమిస్తున్నాడు. ఈ క్రమంలో ఈసీఐఎల్ ప్రాంతంలోనీ ఈ ప్రో సొల్యూషన్స్ డైరెక్టర్, మౌలాలికి చెందిన షేక్ షరీఫ్ కు 25 మంది సెక్యూరిటీ గార్డులు కావాలని యోగేందర్ రాజ్ పుత్ తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. అయితే యోగేందర్ రాజ్పుత్ తన సెక్యూరిటీ గార్డులకు సరైన సమయంలో డబ్బులు ఇవ్వకపోవడంతో... వారు యోగేందర్ రాజ్పుత్ వద్ద పని మానేసి నేరుగా షేక్ షరీఫ్ వద్ద సెక్యూరిటీ గార్డ్ గా పని చేస్తున్నారు. అలాగే యోగేంధర్ రాజ్ పుత్ కు రావలసిన రూ. 3 లక్షల బాకీ డబ్బులను షేక్ షరీఫ్ ఇవ్వటం లేదు. దీంతో మనసులో పెట్టుకున్న యోగేందర్ రాజ్ పుత్... షేక్ షరీఫ్ ను చంపాలని ప్రణాళిక రచించాడు. ఈ క్రమంలో మూడు నెలల క్రితం... మధ్యప్రదేశ్ కి వెళ్లి లల్లు శర్మ నుంచి రూ.20 వేలకు దేశీయ తుపాకి, బుల్లెట్లను కొన్నాడు. తిరిగి హైదరాబాద్కు వచ్చిన యోగేంధర్ రాజ్ పుత్ రెండు నెలల క్రితం షేక్ షరీఫ్ ఆఫీస్ కి వెళ్లి... దేశీయ తుపాకీతో రెక్కీ నిర్వహించి తనకు ఇవ్వాల్సిన బాకీ డబ్బులను ఇవ్వాలని కోరాడు. దీంతో మరుసటిరోజు తప్పకుండా డబ్బులు ఇస్తానని షేక్ షరీఫ్ చెప్పడంతో నమ్మి వెళ్లిపోయాడు. అయినప్పటికీ షేక్ షరీఫ్ మరుసటి రోజు డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేశాడు. దీంతో యోగేందర్ రాజ్పుత్ షేక్ షరీఫ్ ను ఎలాగైనా చంపాలని దేశీయ తుపాకితో సంచరిస్తున్నాడు. విశ్వాసనీయ సమాచారంతో మల్కాజ్గిరి ఎస్ఓటీ పోలీసులు, చర్లపల్లి పోలీసులు.... శుక్రవారం చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద మహీంద్రా జైలో కారులో (టీఎస్ 09 యూఏ 9277) అనుమానస్పదంగా సంచరిస్తున్న యోగేంద్ర రాజపుతును పట్టుకొని తనిఖీ చేశారు. దేశీయ తుపాకీ, 3 బుల్లెట్లు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని హత్యాయత్నం కుట్రను భగ్నం చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్కు తరలించారు. ఈ కేసును చాకచక్యంగా చేదించిన మల్కాజ్గిరి ఎస్ఓటి ఇన్స్పెక్టర్ రాములు, చర్లపల్లి ఇన్స్పెక్టర్ మల్లికార్జున్ రెడ్డి, ఎస్ ఓ టి ఎస్ ఐ పి వాసుదేవ్, జి రఘురాముడు, బి పరమేశ్వర్, ఇతర పోలీసు సిబ్బందిని రాచకొండ సిపి డిఎస్ చౌహన్, డిసిపి జానకి, ఎస్ ఓ టి డి సి పి గిరిధర్ రావుల లు ప్రత్యేకంగా అభినందించారు.

# ఇప్పుడు జగ్గూభాయ్.. రేపు జగ్గూ.. ఆ తర్వాత ఏమంటానో నాకే తెలీదు

ముఖ్యమంత్రి జగన్ పై మరోసారి ఫైర్ అయ్యారు జనసేన అధినేత పవన్ కల్యాణ్.వారాహి విజయయాత్రలో భాగంగా తణుకులో నిర్వహించిన బహిరంగ సభలో పవన్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన... వైసీపీ పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం జగన్ మద్యపాన ప్రియుల పొట్టకొట్టి రూ.30వేల కోట్లు కొట్టేశారని ఆరోపించారు. ధరలు పెంచాడు కాబట్టే పరదాలు కట్టుకుని తిరుగుతున్నాడంటూ ఎద్దేవా చేశారు.

''బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి రాజ్యాంగాన్ని గౌరవించనప్పుడు మిమ్మల్ని మేమెందుకు గౌరవిస్తాం'' అన్నారు. 'జగన్‌ను.. జగ్గూభాయ్ అంటున్నానని వైసీపీ నేతలు తెగ బాధపడుతున్నారు. నన్ను ఏదైనా అనొచ్చు గానీ.. నేను అనకూడదా? మమ్మల్ని బానిసలుగా చూస్తే ఊరుకుంటామా? జగన్ నుంచి జగ్గూభాయ్ వరకు వచ్చాం. ఇంకా ఎక్కువ మాట్లాడితే జగ్గూ అంటాం. వైకాపా నేతలు నోరు జారితే నేనేం అంటానో నాకే తెలీదు. మీ ఇంటికి మా ఇల్లు ఎంత దూరమో.. మా ఇంటికి మీ ఇల్లు కూడా అంతే దూరం. జగన్ నిన్ను జగ్గూభాయ్ అని ఎందుకు అంటున్నానో అర్థమైందా? డిజిటల్ దొంగలా తయారయ్యావు. ప్రజల డబ్బును దోచేస్తున్నావు. జగన్ పథకాలన్నీ 70:30 పథకాలే. జగన్ దోపిడీని కాగ్ సవివరంగా బయటపెట్టింది" అని పవన్ గుర్తు చేశారు. జగన్ చెత్త పాలన వచ్చాకే చెత్త పన్ను వచ్చిందన్నారు పవన్ కల్యాణ్. ఇంటి పన్ను రూ.650 పెంచారని తెలిపారు. డంపింగ్ యార్డు కూడా కట్టకుండా చెత్తపన్ను వేస్తావా? అని ప్రశ్నించారు. " తణుకుకు ఒక డంపింగ్‌యార్డు కూడా సరిగా లేదు. రాజకీయ అవినీతిపై జనసేన పోరాటం చేస్తోంది. రాజకీయ అవినీతి మనం ఆపాలి. రూ.60 మద్యాన్ని రూ. 160కి పెంచారు. జగన్.. నీ పాలన ఏమాత్రం ఆమోదయోగ్యంగా లేదు. ఇసుక ధరను రూ. 10వేల నుంచి రూ.40వేలకు పెంచేశారు. రూ. వేల కోట్లు రుణాలు తీసుకుని బడ్జెట్ లెక్కల్లో చెప్పలేదు. పోలవరం పూర్తి చేయలేరు.. కనీసం కాలువల పూడిక కూడా తీయించలేరా? జగన్ హయాంలో 219 ఆలయాలపై దుర్ఘటనలు జరిగాయి. విగ్రహాల ధ్వంసం కేసులో దోషులను ఇప్పటి వరకు పట్టుకోలేదు. అన్నవరంలో పురోహితులను వేలం పెట్టారు. పురోహితులను వేలం పెట్టడం రాజ్యాంగ విరుద్ధమని తెలుసా? వేలం వేయడానికి రాజ్యాంగ పరమైన హక్కు ఉందా? హిందూ ధర్మానికేనా? ఇతర మతాలకు అలాగే చేస్తారా? "అని పవన్ ప్రశ్నించారు.

జగన్ కొంపలంటీస్తాడు. నేను గుండెలంటిస్తానని అన్నారు పవన్ కల్యాణ్. "భవన నిర్మాణ కార్మికులకు వచ్చే సెస్సును తినేసి వారికి అన్యాయం చేశాడు. సగటు మనిషి కష్టాలు నాకు తెలుసు. జగన్ బటన్ నొక్కాడు. నేను జగన్ నొక్కని



బటన్‌లు చెబుతాను. చెత్త మీద గతంలో పన్ను లేదు. నువ్వు పన్ను వేశావు జగన్. నిత్యావసర వస్తువుల రేట్లను ప్రస్తావించిన పవన్.. 60 రూపాయల మద్యాన్ని 160 రూపాయలకు పెంచి మద్యపాన ప్రియుల పొట్టను కొట్టావు. వారి గుండెలు పిండేసావు. రేట్లు పెంచావు కాబట్టే, జనాలకు మొహం చూపించలేక పరదాలు కట్టుకుని తిరుగుతున్నావ్. తణుకు టీడీఆర్ స్కాంలో రూ. 309 కోట్లు డబ్బు కాజేశారు." అని పవన్ కల్యాణ్ ఆరోపించారు.

తణుకుకు చెందిన కవి దేవరకొండ బాల గంగాధర్ తిలక్ రాసిన మాటలే జనసేన ఆవిర్భావ మాటలు అని గుర్తు చేశారు. "నేను సైద్ధాంతిక బలంతో వచ్చాను. ఓటమి గెలుపు నాకు తెలీదు. ప్రయాణం చేయడమే తెలుసు. సూర్యుడు అస్తమించినా పర్వాలేదు. కవి లేకపోతే ఏమీ నడవదు. దూర్తుల సామ్రాజ్యంలో జనం హాహాకారాలు అంటూ కవిత్వం చెప్పిన పవన్... తణుకులో నన్నయ్య భట్టారక పీఠాన్ని ఎంతో కవులు సందర్శించారని పవన్ అన్నారు. రెండో విడత వారాహి విజయయాత్ర తణుకులో ముగిస్తున్నామని ప్రకటించారు.



## ఉప్పల్ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తా

### ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి

**జయభేరి, ఉప్పల్:**

ఉప్పల్ డివిజన్ పరిధిలోని ఉప్పల్ బొడ్రాయి హనుమ సాయి నగర్, విజయపురి, న్యూ విజయపురి ,సాయిరాం కాలనీ ,శాంతినగర్, లో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి బి ఆర్ ఎస్ నాయకులతో కలిసి పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా 10వ రోజు శుక్రవారం నిర్వహించారు. ప్రజల నుండి సమస్యలు తెలుసుకుంటూ ఇంటి ఇంటికి తిరుగుతూ సమస్యలు , వారి యోగ క్షేమాలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. వీధి దీపాల ఏర్పాటు, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను రోడ్డు పక్కకు జరిపి చుట్టూ ప్రహరీ ఫెన్సింగ్ నిర్మించాలని, మురికి కాలువ నుండి తీసిన వ్యర్థాలను తొలగించాలని, పారిశుద్ధ నిర్వహణ చేయాలని, మాన్యువల్స్ ఏర్పాటు చేయాలని, సీసీ రోడ్డు వెయ్యాలని, ఆసరా పెన్షన్స్ ఇవ్వలని స్థానిక కాలనీలవాసులు ఎమ్మెల్యే గారికి వినతి పత్రాలు అందజేశారు. అందుకు ఎమ్మెల్యే ప్రజల నుండి వినతి పత్రాలను స్వీకరిస్తూ వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం న్యూస్ శాంతినగర్ లోని హనుమాన్ దేవాలయం ఆవరణంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పాదయాత్రలో ఎమ్మెల్యే గారి దృష్టికి వచ్చిన సమస్యలను వివరించి, సమస్యలను త్వరతగతిన పరిష్కరించిన విషయాలను తెలియజేశారు, ఈ పాదయాత్రలో మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి, ఉప్పల్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అరటికాయల భాస్కర్ ముదిరాజ్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వేముల సంతోష్ రెడ్డి రెడ్డి, జె. ప్రభాకర్ రెడ్డి, శైలేష్ రెడ్డి, స్థానిక నాయకులు డివిజన్ అధ్యక్షులు, కాసం మైపాల్ రెడ్డి, పల్ల కిరణ్ కుమార్ రెడ్డి, కార్యకర్తలు అబిమానులు తదితరులు పాల్గొన్నారు .

# వాలంటీర్లూ... మీరు ఆ పనులు చేయకండి



ఏపీలో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వాలంటీర్ వ్యవస్థపై పవన్ కల్యాణ్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. కీలకమైన డేటా సేకరిస్తున్నారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. వారాహి యాత్రలో భాగంగా మాట్లాడుతున్న పవన్ కల్యాణ్... వాలంటీర్లు వైసీపీకి ప్రైవేటు సైన్యంగా మారారంటూ కామెంట్స్ కూడా చేస్తున్నారు. ఈ విషయంలో వాలంటీర్లు ఆందోళనలు చేస్తుండగా... వైసీపీ కూడా పవన్ టార్గెట్ గా తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే... తాజాగా టీడీపీ అధినేత చంద్రబాబు కూడా స్పందించారు. వాలంటీర్లు రాజకీయం చేయవద్దని కోరారు.

శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో "మహాశక్తి చైతన్య రథ యాత్ర" ప్రారంభ సభ కార్యక్రమం జరిగింది. ఇందులో పాల్గొన్న చంద్రబాబు... ప్రసంగించారు. వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూనే... వాలంటీర్లు అంశంపై స్పందించారు. వాలంటీర్లు ఇప్పుడే ఇళ్లలోకి వస్తున్నారని...అలా ఎందుకు వస్తున్నారని ప్రశ్నించారు. వాలంటీర్లు రాజకీయాలు చేయడం సరికాదన్నారు. సైకో చెప్పిన పనులు చేయొద్దన్న చంద్రబాబు... మీరు పార్టీ పనులు చేస్తే ఆ ఆడబిడ్డలు వదిలిపెట్టరని హెచ్చరించారు. అలా చేస్తే వాలంటీర్లను కచ్చితంగా నిలదీస్తారని కామెంట్స్ చేశారు.

వాలంటీర్లూ! ప్రజలకు అవసరమైన ప్రభుత్వ పనులు మాత్రమే చేయండి. రాజకీయ చేయొద్దు. సైకో చెప్పిన పనులు చేయవద్దు. పార్టీ పనులు చేస్తే మా ఆడబిడ్డలు మిమ్మల్ని నిలదీస్తారు. ఆంధ్రప్రదేశ్ లోని మహిళలందరు మహాశక్తి సంకల్పం తీసుకోవాలన్నారు చంద్రబాబు. అన్ని సమస్యలకి పరిష్కార మార్గం మహాశక్తి సంకల్పం అని చెప్పారు. ఆడపిల్లలకు ఆస్తి ఉండాలని... చదువు ఉండాలని మహిళాభ్యుదయానికి శ్రీకారం చుట్టింది ఎన్టీఆర్ అని గుర్తు చేశారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించింది కూడా తెలుగుదేశమే అని అన్నారు. మగవారి కంటే మహిళలకే తెలివితేటలు ఎక్కువని కొనియాడారు. మహిళల ప్రోత్సాహకానికి ఎన్నో కార్యక్రమాలతో పాటు పెద్దగా చదువుకోని వారి కోసం డ్వాక్రా సంఘాలు తీసుకొచ్చిన చరిత్ర కూడా టీడీపీదే అని అన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తామని పునరుద్ఘాటించారు చంద్రబాబు. ప్రస్తుతం గ్యాస్ ధరలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంపద సృష్టించడం తెలిసిన నాయకుడు మన చంద్రబాబు అని ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు. సృష్టించిన సంపదను ప్రజలకు పంచడం కూడా తెలిసిన నాయకుడు చంద్రబాబు అని ప్రశంసలు కురిపించారు. మహిళా శక్తిని మహాశక్తిగా మార్చడానికి 40 ఏళ్ళ క్రితమే అంకురార్పణ జరిగిందన్నారు తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత. మహిళలకు తండ్రి ఆస్తిలో సమాన హక్కు కల్పించిన చరిత్ర తెలుగుదేశం పార్టీ అని గుర్తు చేశారు. సంక్షేమం అంటేనే టీడీపీ అని వ్యాఖ్యానించారు.

## వ్యవసాయంలో డ్రోన్లను విస్తృతంగా వినియోగించండి

వ్యవసాయ రంగంలో డ్రోన్లను విస్తృతంగా వినియోగించాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. డ్రోన్ టెక్నాలజీ ద్వారా వ్యవసాయ రంగంలో బహుళ ప్రయోజనాలు పొందాలన్నారు. ఈ మేరకు వ్యవసాయ, ఉద్యానవనశాఖలపై శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్ సన్నద్ధతతో పాటు వ్యవసాయ అనుబంధశాఖల్లో చేపడుతున్న కార్యక్రమాల ప్రగతిని అధికారులు సీఎంకు వివరించారు. ఈ-క్రాపింగ్‌లో జియో ఫెన్సింగ్ ఫీచర్ కూడా కొత్తగా ప్రవేశపెట్టామని అధికారులు తెలిపారు. ఖరీఫ్ పంటల ఈ-క్రాపింగ్ మొదలైందని, ఈసారి ముందస్తుగానే మొదలుపెట్టామని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు డేటాను అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. సీఎం జగన్ మాట్లాడుతూ.... ఇప్పటికే పురుగుమందుల వినియోగం లాంటి కార్యక్రమాలు డ్రోన్ల ద్వారా చేస్తున్నామని తెలిపారు. ఇదే కాకుండా డ్రోన్ల ద్వారా భూసార పరీక్షలు చేయించే పరిస్థితిని తీసుకురావాలని తెలిపారు. తద్వారా ఆర్బీకే స్థాయిలో భూసార పరీక్షలు చేసే స్థాయికి ఎదగాలని చెప్పారు. భూసార పరీక్షలను క్రమం తప్పకుండా ఎప్పటికప్పుడు డ్రోన్ల ద్వారా తెలుసుకునే పరిస్థితి వస్తే ప్లాంట్ డాక్టర్ కాన్సెప్ట్‌ను సమర్థవంతంగా అమలు చేసే అవకాశం ఉంటుందన్నారు. డ్రోన్ల ద్వారా డేటా కూడా కచ్చితత్వంతో ఉండేందుకు అవకాశం ఉంటుందని సీఎం జగన్ తెలిపారు. దీంతోపాటు పంట దిగుబడులపై అంచనాలకు కూడా డ్రోన్లను వినియోగిస్తున్నారని చెప్పారు. ఇప్పటికే వరి దిగుబడులపై డ్రోన్ల ద్వారా అంచనాలు పొందేలా డ్రోన్ టెక్నాలజీని వాడుకునేందుకు ప్రయత్నిస్తున్నామని అధికారులు చెప్పగా.. మిగతా పంటల విషయంలో కూడా ఈ తరహా ప్రయోజనాలు డ్రోన్ టెక్నాలజీ ద్వారా వచ్చే పరిస్థితి ఉండాలని సీఎం పేర్కొన్నారు. బహుళ ప్రయోజనకారిగా డ్రోన్లను వినియోగించుకోవడంవల్ల వ్యవసాయ రంగానికి, రైతులకు మరింత మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వం వచ్చాక ఏర్పాటు చేసిన అగ్రిల్యాబ్‌లు ద్వారా 2.2 లక్షల శాంపిళ్లను సేకరించి రైతులకు ఫలితాలు అందిస్తున్నామని అధికారులు తెలిపారు.

ప్రభాత జయభేరి jayabheridaily.com



## గ్రీనరీ పేరుతో... ఇష్టారాజ్యంగా అభివృద్ధి పనులు

**జయభేరి, కుషాయిగూడ:**

గ్రీనరీ పేరుతో ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారు. ఈసీఐఎల్ చౌరస్తా నుంచి చక్రిపురం కృష్ణానగర్ ప్రధాన రోడ్డు వరకు రూ.12 లక్షల నిధులతో చేపడుతున్న పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయి. ఇక్కడి డివైడర్ మధ్యలో... మట్టినింపి పూలు, ఇతర పచ్చదాన్ని పెంపొందించే మొక్కలను నాటాలి. అయితే గతంలో ఉన్న మొక్కలకు ఇనుప ట్రీ గార్డులు తొలగించకుండానే మట్టిని నింపుతున్నారు. సుమారు 200 నుంచి 250 వరకు ఉన్న ఈ ట్రీ గార్డులు తొలగించకపోవడంతో భవిష్యత్తులో.... చెట్లు పెరగకుండా ఉచ్చుగా మారే అవకాశం ఉంది. అలాగే గతంలో డివైడర్ మధ్యలో నింపిన రాళ్ళ, వ్యర్థాలను తొలగించకుండా దానిపైనే మట్టిని నింపుతున్నారు. ఉద్యానవనం అధికారులు దృష్టి సారించకపోవడంతో... కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. అలాగే నాణ్యమైన మొక్కలను కూడా నాటడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఉద్యానవనం ఏఈ నరసింహారావు వివరణ కోరగా... డివైడర్ మధ్యలో మట్టి నింపిన తర్వాత బయటికి వచ్చిన ఇనుప సంరక్షణ కంచే ను కట్ చేస్తామని తెలిపారు. అభివృద్ధి పనులు పై దృష్టి సారించి పూర్తయ్యేలా చూస్తామని తెలిపారు.

## సెల్‌కాన్ చేతికి టచ్ మొబైల్స్.. 200 ఫ్రాంచైజీ స్టోర్ల ఏర్పాటుకు ప్రణాళిక




సెల్‌కాన్ కంపెనీ మొబైల్స్ రీటైల్ చైన్ సంస్థ టచ్ మొబైల్స్ కంపెనీని కొనుగోలు చేసింది. సెల్‌కాన్ కంపెనీ విస్తరణ వ్యూహంలో ఈ డీల్ ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. మొబైల్స్ రిటైల్ మార్కెట్‌లో కీలక ప్లేయర్‌గా టచ్ మొబైల్స్ తమ స్థానాన్ని పదిలపరుస్తుందని కంపెనీ గురువారం ప్రకటించింది. సెల్‌కాన్ గ్రూప్ 202223లో రూ. 2,600 కోట్ల ఆదాయం ఆర్జించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 5,000 కోట్లు ఆశిస్తోంది. టచ్ మొబైల్స్ విభిన్న బ్రాండ్ల స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్ పీసీలు, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఉపకరణాలను అందిస్తూ టెక్ ఔత్సాహికుల కోసం వన్ స్టాప్ సొల్యూషన్‌గా పేరుగాంచింది. 40కి పైగా స్టోర్లను కలిగి ఉన్న టచ్ మొబైల్స్ వినియోగదారులకు యాపిల్, సామ్‌సంగ్, వన్‌ప్లస్, ఒప్పో, వివో, షావోమీ, రియల్‌మీ, మోటరోలా, బోట్, నాయిస్, కనెక్ట్ వంటి ప్రముఖ బ్రాండ్ల ఉత్పత్తులను విస్తృత శ్రేణిలో విక్రయిస్తోంది. ఆధునిక సాంకేతికత కోరుకునే కస్టమర్ల కోసం మొబైల్ టెక్నాలజీ రంగంలో అత్యుత్తమ ఉత్పత్తులను అందించాలన్న లక్ష్యంతో సాగుతున్న టచ్ మొబైల్స్‌కు విశ్వసనీయ రిటైలర్‌గా పేరుంది. దక్షిణాదితోపాటు మహారాష్ట్రలో అదనంగా 200 ఫ్రాంచైజీ స్టోర్లతోపాటు కంపెనీ యాజమాన్యంలో 50 ఔట్‌లెట్లను స్థాపించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సెల్‌కాన్ సీఎండీ వై.గురు ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. ఈ విస్తరణ వ్యూహంలో టచ్ మొబైల్స్ అసాధారణ ఉత్పత్తులు, సేవలను కొత్త ప్రాంతాలకు తీసుకువెళ్తామని చెప్పారు. యువ వ్యాపారవేత్తలకు అవకాశాలను అందించడంపై ప్రత్యేకంగా దృష్టిసారించామని వివరించారు. టచ్ మొబైల్స్ నగరాలు, చిన్న పట్టణాల్లోని ఫ్రాంచైజీ వ్యాపార అవకాశాలను గుర్తిస్తోంది. ఔత్సాహిక యువ వ్యాపారవేత్తలతో ఫ్రాంచైజీ భాగస్వామ్యాలను కుదుర్చుకోవడం ద్వారా టచ్ మొబైల్స్ చిన్న పట్టణాలలో కూడా తన ఉనికిని చాటుకోవాలని భావిస్తోంది. వివిధ ప్రాంతాల్లోని కస్టమర్లు విభిన్న శ్రేణి మొబైల్ ఉత్పత్తుల నుండి ప్రయోజనం పొందాలన్నది కంపెనీ ఆలోచన. టచ్ మొబైల్స్ ప్రతిష్టాత్మక ఆదాయ లక్ష్యాలను నిర్దేశించుకుంది. 2023 24లో ఆదాయం రూ.200 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తోంది. సెల్‌కాన్ గ్రూప్ యొక్క 30 సంవత్సరాలకు పైగా రిటైల్ నైపుణ్య వారసత్వం టచ్ మొబైల్స్ స్టోర్ల విలువను మరింత పెంచుతుంది. ఫ్రాంచైజీ అవకాశాలను అందించడం ద్వారా యువతలో వ్యవస్థాపకతను నడిపించాలన్న సెల్‌కాన్ గ్రూప్ ఆశయం ఈ డీల్‌తో నెరవేరుతుందని భావిస్తోంది. ప్రతిభను పెంపొందించడానికి టచ్ మొబైల్స్ కట్టుబడి ఉంది. ఈ సంస్థ 10వ తరగతి విద్యార్థులు మొదలుకుని ఐటీ నిపుణుల వరకు సేవలను విస్తరించనుంది. అభ్యర్థులకు మొబైల్ పరిశ్రమలో రాణించడానికి అవసరమైన నైపుణ్యాలను అందిస్తుంది. ఇందులో భాగంగా ఏటా 500-1,000 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. విజయవంతంగా శిక్షణ పొందిన అభ్యర్థులకు ఉపాధి అవకాశాలను అందించాలని టచ్ మొబైల్స్ యోచిస్తోంది. పరిశ్రమలో మహిళలకు సాధికారత కల్పించడానికి టచ్ మొబైల్స్ కట్టుబడి ఉంది. మహిళలతో నడిచే ప్రత్యేకమైన స్టోర్‌లను ఏర్పాటు చేయనుంది. సిబ్బంది ఎంపిక విషయంలో లింగ సమానత్వాన్ని ప్రోత్సహిస్తుంది. నైపుణ్యం కలిగిన, శిక్షణ పొందిన ఉద్యోగులు, సర్వీస్ కేంద్రాలపై దృష్టి సారించడంతోపాటు ప్రతి స్టోర్ అసమానమైన కస్టమర్ అనుభవాన్ని అందిస్తుంది. ఈ ముఖ్యమైన కొనుగోలును పురస్కరించుకుని టచ్ మొబైల్స్ ప్రస్తుతం ఆకర్షణీయ డీల్స్, ప్రమోషన్స్ శ్రేణిని అందిస్తోంది. మొబైల్స్ కొనుగోలు చేసిన కస్టమర్లు రూ. 2 కోట్ల రూపాయల విలువైన బహుమతులను గెలుచుకునే అవకాశం ఉంది. అదనంగా టచ్ మొబైల్స్ ఆకర్షణీయమైన ఎక్స్ఛేంజ్ ఆఫర్‌లు, స్క్రాచ్ కార్డ్ ద్వారా బహుమతులు గెలుపొందే చాన్స్ ఉంది. 2009లో స్థాపించిన సెల్‌కాన్ గ్రూప్ ప్రపంచవ్యాప్తంగా కస్టమర్ బేస్‌తో ప్రముఖ మొబైల్ బ్రాండ్, ఎలక్ట్రానిక్స్ సొల్యూషన్ ప్రొవైడర్‌గా ఉంది. తయారీ, రిటైల్, పంపిణీ, విశిష్ట బ్రాండ్ సేవలతో సహా సమగ్ర ఎండ్-టు-ఎండ్ సేవలను అందిస్తోంది. టీవీలు, సెట్ టాప్ బాక్సులు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, టాబ్లెట్ పీసీలు, ఆండ్రాయిడ్ బాక్సులు, గ్యాడ్జెట్స్ వంటివి తయారు చేస్తోంది. 'మేక్ ఇన్ ఇండియా' చొరవకు మద్దతుగా నిలుస్తోంది.

# ఇండియా కోసం టెస్లా క్రేజీ ప్లాన్..




ఇండియాలో అడుగుపెట్టాలని భావిస్తున్న టెస్లా.. అందుకు తగ్గట్టు సన్నద్ధమవుతోందని తెలుస్తోంది. ఈ మేరకు టెస్లా ప్రణాళికలకు సంబంధించిన ఓ నివేదిక బయటకొచ్చింది. ఇండియాలోకి టెస్లా రాకపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో దిగ్గజ ఆటోమొబైల్ సంస్థ ప్లాన్స్కు సంబంధించిన ఓ వార్త బయటకొచ్చింది. దేశంలో ప్రతియేటా కనీసం 5లక్షల ఎలక్ట్రిక్ వాహనాలను తయారు చేయాలని ఎలాన్ మస్క్ సంస్థ ప్రణాళికలు రచించిందని ఓ నివేదిక వెల్లడించింది. ఈ మేరకు భారత ప్రభుత్వంతో చర్చలు జరుపుతోందని పేర్కొంది. అంతేకాకుండా.. ఇక్కడ తయారు చేసిన వాహనాలను ఇండో పెసిఫిక్ ప్రాంతాలకు ఎగుమతి చేసేందుకు కూడా సంస్థ ప్లాన్ చేస్తున్నట్టు తెలిపింది. అన్ని అనుకున్నట్టు జరిగితే.. ఇండియాలో టెస్లా ఓ పెద్ద ఫ్యాక్టరీని సిద్ధం చేస్తుంది. ఇండియాను ఎక్స్పోర్ట్ హబ్గా తయారు చేస్తుంది.

ఇండియాలోకి టెస్లా రాక కోసం చాలా మంది ఎదురుచూస్తున్నారు. గతంలో ప్రయత్నాలు జరిగినా.. పెద్దగా ఫలితాల్ని ఇవ్వలేదు. కానీ ఇప్పుడు.. ఎలామ్ మస్క్క చెందిన సంస్థ, ఇండియాలోకి అడుగుపెట్టడం దాదాపు ఖరారైనట్టే కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో వాహనాల ధరలు ఎంత ఉండొచ్చు? అన్న సందేహాలు మొదలయ్యాయి. సాధారణంగానే టెస్లా మోడల్స్ అంటే.. లగ్జరీ వాహనాలు అని గుర్తింపు ఉంది. ఇక ఇండియాలోనూ ఇదే విధంగా సంస్థ మోడల్స్ ఉండొచ్చు. సంబంధిత నివేదిక ప్రకారం.. ఇండియాలో టెస్లా కార్ల ప్రారంభ ఎక్స్షోరూం ధర 24,400.66 డాలర్లుగా ఉండొచ్చు. అంటే.. ఇండియన్ కరెన్సీలో ఇది సుమారు రూ. 20.02 లక్షలు! ప్రస్తుతం దేశంలో అందుబాటులో ఉన్న అతి చౌకైన ఎలక్ట్రిక్ వాహనం ఎంజీ కామెట్ ఈవీతో పోల్చుకుంటే దీని ధర రెండింతల కన్నా ఎక్కువ! బెస్ట్ సెల్లింగ్ టాటా నెక్సాన్ ఈవీతో పోల్చుకుంటే.. రూ. 5లక్షల కన్నా ఎక్కువ.

వాస్తవానికి భారత్లో ఉండే ట్యాక్స్ కారణంగానే టెస్లా ఇంతకాలం వెనకడుగు వేసింది. ఈ విషయాన్ని ఎలాన్ మస్క్ కూడా చాలాసార్లు ప్రస్తావించారు.

అయితే.. వాహనాలను ఇండియాలో తయారు చేస్తే పన్నులు తగ్గిస్తామని భారత ప్రభుత్వం సూచనలు ఇచ్చింది. తొలుత ఈ ప్రతిపాదనని టెస్లా తోసిపుచ్చింది. ముందు ఈవీలను పంపిస్తామని, ఆ తర్వాత డిమాండ్ బట్టి తయారీ విషయాన్ని చూస్తామని పేర్కొంది. ఫలితంగా ఇరుపక్షాల మధ్య ఒప్పందం కుదరలేదు. కొంతకాలం తర్వాత టెస్లా మనసు మార్చుకుంది! ఇండియాలో ఎలక్ట్రిక్ వాహనాలను తయారు చేసేందుకు ముందుకొచ్చింది. అదే సమయంలో గత నెలలో అమెరికాకు వెళ్లిన ప్రధాని మోదీ.. ఎలాన్ మస్క్తో చర్చలు జరిపారు. దేశంలో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. ఇక ప్రస్తుతం టెస్లా ప్రభుత్వం మధ్య చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే ఇరు పక్షాలు ఒక ఒప్పందానికి వస్తాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# పోలీసు అధికారి అని చెప్పి.. యువతిపై అత్యాచారం!



'నువ్వు, నీ బాయ్ఫ్రెండ్ కలిసి ఉన్న వీడియోలు నా దగ్గర ఉన్నాయి. సోషల్ మీడియాలో లీక్ చేస్తా,' అని బెదిరించిన ఓ వ్యక్తి, ఓ యువతిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. తాను దిల్లీ పోలీసును అంటూ చెప్పుకొచ్చాడు. చివరికి పోలీసులకు చిక్కాడు. పోలీసు అధికారిని అంటూ.. ఓ 20ఏళ్ల యువతిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. దిల్లీలో జరిగిన ఈ ఘటన వార్తలకెక్కింది. దిల్లీలోని ఓ గేటెడ్ సొసైటీలో జులై 7 రాత్రి ఈ ఘటన జరిగింది. బాధితురాలు.. తన స్నేహితులతో కలిసి బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి వెళుతుండగా.. మెట్ల మార్గంలో ఓ వ్యక్తి ఆమెను అడ్డుకున్నాడు. తనని తాను, దిల్లీ పోలీసు అధికారి అని పరిచయం చేసుకున్నాడు. ఓ ఐడీ కార్డును కూడా చూపించాడు! యువతికి ఏం జరుగుతోందో అర్థం కాలేదు. ఇంతలో ఆ వ్యక్తి, యువతిని బెదిరించాడు. "నువ్వు, నీ బాయ్ఫ్రెండ్ సన్నిహితంగా ఉన్న వీడియో నా దగ్గర ఉంది. ఇది మీ ఇంట్లో వాళ్లకి చూపిస్తాను. సోషల్ మీడియాలో వైరల్ చేస్తాను," అని ఆ వ్యక్తి అనడంతో యువతి భయపడిపోయింది. ఆ తర్వాత, ఆమెను బెదిరించి ఇంటి మీదకు తీసుకెళ్లాడు. అక్కడే 20ఏళ్ల యువతిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే, వీడియోను లీక్ చేస్తానని బెదిరించాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. తనకు ఎదురైన ఘటనతో యువతి భయపడిపోయింది. చివరికి ధైర్యం తెచ్చుకుని పోలీస్ స్టేషన్కు వెళ్లింది. తనకు జరిగినది వివరించింది. దిల్లీ పోలీసు నుంచి ఓ వ్యక్తి తనను రేప్ చేశాడని ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే.. నిందితుడు పేరు రవి సొలంకి అని, అతను అసలు పోలీసుశాఖలోనే పనిచేయడం లేదని తెలుసుకున్నారు. "కష్టమైన కేసును మేము ఛేదించాము. నిందితుడి వివరాలు ఎవరికి తెలియదు. బాధితురాలు ఇచ్చిన సమాచారంతో అతని ముఖాన్ని గీయించాము. మరోవైపు అత్యాచారానికి పాల్పడిన తర్వాత.. ఓ బైక్ మీద అతను రైథల మెట్రో స్టేషన్ వరకు వెళ్లాడు. సీసీటీవీ ఫుటేజ్లో స్పష్టంగా ఉంది. కానీ అక్కడి నుంచి మాయమైపోయాడు. 250కిపైగా సీసీటీవీ కెమెరాలను పరిశీలించాము. 40మందినిపైగా వ్యక్తులను విచారించాము. 1000కిపైగా వాహనాలను పరీక్షించాము. చివరికి.. గురువారం అతడిని పట్టుకున్నాము. మాకు అందిన సమాచారంతో సెక్టార్ 24లోని ఓ మాల్కు వెళ్లి, అతడిని అరెస్ట్ చేశాము," అని పోలీసు అధికారి వెల్లడించారు. నిందితుడిని విచారించిన పోలీసులు.. అసలు విషయాన్ని బయటపెట్టారు. "ఆమెను, ఆమె బాయ్ఫ్రెండ్ను నేను చాలా రోజులుగా ఫాలో అయ్యాను. కారులో ఉన్నప్పుడు వారి ఫొటోలను తీశాను. ఆమె ఒంటరిగా ఉండటం కోసం ఎదురుచూశాను. ఇండియాలో మహిళలు, వారి బాయ్ఫ్రెండ్స్ గురించి తల్లిదండ్రులకు చెప్పరు. అలా ఆమెను భయపెట్టాను," అని నిందుతుడు పోలీసులకు వివరించాడు. 33ఏళ్ల సొలంకి.. పూత్ కలాన్ గ్రామానికి చెందినవాడు. 2016లో అతనికి పెళ్లి జరిగింది. అతనికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. స్మగ్లింగ్కు సంబంధించి అతనిపై ఇప్పటికే 5 కేసులు ఉన్నాయి. ఘటన జరిగిన సమయంలో యువతికి నిందితుడు చూపించిన ఐడీ కార్డు ఫేక్ అని తేలింది. తన వద్ద ఉన్న ఆర్మ్స్ లైసెన్స్ను చూపించి, అది దిల్లీ పోలీసు కార్డు అని అబద్ధం చెప్పాడు. దానిపై దిల్లీ పోలీసు విభాగానికి చెందిన వాటర్మార్క్, మోనోగ్రామ్ ఉండటంతో బాధితురాలు నమ్మేసింది.

# బావిలో దళిత యువతి మృతదేహం.. గ్యాంగ్ రేప్ చేసి చంపేశారా?




రాజస్థాన్లో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. 19ఏళ్ల యువతి మృతదేహం బావిలో కనిపించింది. కొందరు ఆమెను రేప్ చేసి, చంపి, బావిలో పడేశారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై రాష్ట్రంలో రాజకీయ దుమారం చెలరేగింది. బాధితురాలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన తర్వాత ఆమెను చంపేసి, బావిలో పడేశారని ఆరోపణలు వస్తున్నాయి. రాజస్థాన్ కరౌలి జిల్లాలోని హిండౌన్ నగరంలో ఉన్న బావిలో గురువారం యువతి మృతదేహం కనిపించింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనాస్థలానికి వెళ్లిన పోలీసులు.. మృతదేహాన్ని బావిలో నుంచి తీసి పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. బాధితురాలు.. బాల్ఘట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువతి అని గుర్తించారు. ఆమె కుటుంబసభ్యులకు సమచారం అందించారు. ఘటన గురించి సమాచారం అందుకున్న బీజేపీ నేత, రాజ్యసభ ఎంపీ కిరోది లాల్ మీనా.. ఆసుపత్రికి వెళ్లారు. అదే సమయంలో అనేకమంది బీజేపీ కార్యకర్తలు కూడా అక్కడికి వెళ్లారు. "నదోతి ప్రాంతం నుంచి బాధితురాలు ఇంటికి వెళుతుండగా.. కొందరు దుండగులు ఆమెను అపహరించారు. అనంతరం సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తర్వాత ఆమెను చంపి, బావిలో పడేశారు," అని ఎంపీ మీనా తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తర్వాత, బాధిత కుటుంబంతో మాట్లాడతామని, వారికి న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. "యాసిడ్ దాడులు, రేప్లపై రాష్ట్రాలకు సుప్రీంకోర్టు సూచనలు చేసింది. కానీ ఇక్కడి ప్రభుత్వం అందుకు తగ్గట్టు చర్యలు చేపట్టడం లేదు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు పోరాడతాము," అని ఎంపీ మీనా అన్నారు.

**'పోలీసుల నిర్లక్షం..!'**

మరోవైపు.. ఈ ఘటనకు సంబంధించి, పోలీసుల తీరుపైనా బీజేపీ నేతలు ఆరోపణలు చేస్తున్నారు. "బాధితురాలు కనిపించడం లేదని ఆమె కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్కు వెళ్లారు. ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు వారి మాటలను, ఫిర్యాదును పట్టించుకోలేదు.

సంబంధిత అధికారులపై కఠినమైన చర్యలు చేపట్టాలి," అని బీజేపీ రాజస్థాన్ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు ధర్మ దాగుర్ మండిపడ్డారు. ఇంత జరిగినా.. జిల్లా కలెక్టర్ కానీ, జిల్లా ఎస్పీ కానీ ఆసుపత్రికి రాలేదని, ఫలితంగా అధికారుల నిర్లక్షం స్పష్టమవుతోందని ఆరోపించారు. నిందితులను వెంటనే పట్టుకోవాలని సర్వత్రా డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. బాధిత కుటుంబానికి రూ. 20లక్షల పరిహారంతో పాటు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని దాగుర్ డిమాండ్ చేశారు. బీజేపీ నేతలు, కార్యకర్తల నిరసనలతో ఆసుపత్రి వద్ద స్వల్ప ఉద్రిక్త వాతావరణ నెలకొంది. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసు అధికారులు.. పరిస్థితిని అదుపుచేశారు. నిందితులను పట్టుకుంటామని హామీనిచ్చారు.




సెర్బియా టెన్నిస్ స్టార్ నొవాక్ జకోవిచ్ తొమ్మిదోసారి వింబుల్డన్ ఫైనల్లో అడుగుపెట్టాడు. దాంతో, అత్యధికంగా 35 సార్లు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్ చేరిన తొలి ఆటగాడిగా రికార్డుల్లోకి ఎక్కాడు. అమెరికా లెజెండ్ క్రిస్ ఎవర్ట్ నెలకొల్పిన రికార్డును బద్ధలు కొట్టాడు. ఎవర్ట్ తన కెరీర్‌లో 34 గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్ ఆడాడు. సెమీఫైనల్లో 8వ సీడ్ జన్నిక్ సిన్నర్ పై గెలుపొందాడు. హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో 63, 64, 76(74)తో సిన్నర్‌ను జకోవిచ్ చిత్తు చేశాడు. ఫైనల్లో అతను కార్లోస్ అల్కరాజ్, డానిల్ మెద్వెదేవ్ మ్యాచ్ విజేతను ఢీ కొట్టనున్నాడు. టైటిల్ పోరులో జకోవిచ్ విజయం సాధిస్తే ఆస్ట్రేలియా దిగ్గజం మార్గరెట్ కోర్ట్ ఆల్ టైమ్ 24 టైటిళ్ల రికార్డును సమం చేస్తాడు.

**ఫెదరర్ రికార్డుకు ట్రోఫీ దూరంలో..**

ఈమధ్యే 23 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లతో జకోవిచ్ ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ నెగ్గిన జకోవిచ్ స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్(22)ను దాటేశాడు. అంతేకాదు ఈసారి వింబుల్డన్ విజేతగా నిలిస్తే మాజీ వరల్డ్ నంబర్ 1 రోజర్ ఫెదరర్ రికార్డు సమం చేస్తాడు. ఫెదరర్ 8 సార్లు వింబుల్డన్ చాంపియన్‌గా నిలిచాడు. అతడి ఫీట్‌ను అందుకునేందుకు జకోవిచ్ ఒక్క అడుగు దూరంలో ఉన్నాడు. గాయం నుంచి కోలుకున్న తర్వాత ఈ సెర్బియా స్టార్ మరింత దూకుడుగా ఆడుతున్నాడు. వరుస టోర్నీల్లో టైటిళ్లు కొల్లగొడుతూ రికార్డులు సృష్టిస్తున్నాడు.

## దక్షిణాఫ్రికా నుంచి తీసుకువచ్చిన వాటిలో మరో చీతా మృతి



దక్షిణాఫ్రికా నుంచి తీసుకువచ్చిన చీతాల్లో మరో చీతా మృతి చెందింది. చీతా మెడపై గాయాలున్నాయని వైద్యులు తెలిపారు. చీతా బరువు కూడా భారీగా తగ్గిందని వివరించారు. దక్షిణాఫ్రికా నుంచి తీసుకువచ్చిన చీతాలను మధ్య ప్రదేశ్ లోని కునొ నేషనల్ పార్క్ లో వదిలిపెట్టారు. ప్రధాని మోదీ పుట్టిన రోజు సందర్భంగా సెప్టెంబర్ 17న వాటిని కునొ నేషనల్ పార్క్ లో వదిలిపెట్టారు. వాటిలో ఒక మగ చీతా ఇప్పుడు మరణించింది. సూరజ్ అనే పేరున్న ఆ చీతా మెడపై గాయాలున్నాయని, ఆ గాయాలు ఎలా అయ్యాయో పోస్ట్ మార్టంలో తేలుతుందని వైద్యులు తెలిపారు. కునొ నేషనల్ పార్క్ లో శుక్రవారం ఉదయం పెట్రోలింగ్ అండ్ మానిటరింగ్ టీమ్ కు ఈ చీతా పూర్తిగా బలహీనంగా, పడిపోయిన స్థితిలో కనిపించింది. వీరు వెంటనే వైద్యులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చేలోపే ఆ చీతా మరణించింది. దాని బరువు కూడా భారీగా తగ్గింది. ఈ ఫిబ్రవరిలో దాదాపు 55 కేజీలు ఉన్న ఆ చీతా ఇప్పుడు 43 కేజీలకు తగ్గిందని తెలిపారు. దక్షిణాఫ్రికా నుంచి తీసుకువచ్చిన చీతాల్లో ఇప్పటివరకు 8 చీతాలు మరణించాయి. ఈ నెలలోనే రెండు చీతాలు చనిపోయాయి. మూడు రోజుల క్రితమే తేజస్ అనే మగ చీతా మరణించింది. ప్రస్తుతం ఆ పార్క్ లో ఒక చిన్న చిరుత సహా 16 చీతాలున్నాయి. కేవలం 16 చదరపు కిమీల విస్తీర్ణం ఉన్న ప్రాంతంలో ఉండాల్సి రావడం వల్ల ఆ చీతాల్లో అనారోగ్య సమస్యలు వచ్చి ఉండవచ్చని దక్షిణాఫ్రికా చీతా ఎక్స్ పర్ట్ ఆడ్రియన్ టార్డిఫ్ తెలిపారు. ఆ చీతాలను క్వారంటైన్ పీరియడ్ తరువాత నేరుగా అడవిలో వదిలి ఉంటే బావుండేదని అభిప్రాయపడ్డారు.

## భారత జట్టు దక్షిణాఫ్రికా పర్యటన ఖరారు..

వెస్టిండీస్ పర్యటనలో ఉన్న భారత జట్టు త్వరలోనే దక్షిణాఫ్రికా గడ్డపై కాలుమోపనుంది. అవును.. టీమిండియా, దక్షిణాఫ్రికా పర్యటన ఖరారైంది. భారత క్రికెట్ బోర్డు, దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డులు ఈరోజు షెడ్యూల్ విడుదల చేశాయి. సఫారీ గడ్డపై టీమిండియా 3 టీ20లు, 3 వన్డేలు, రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది. టీ 20 మ్యాచ్‌తో సిరీస్ ప్రారంభం కానుంది. ఇరుజట్ల మధ్య దర్బన్ వేదికగా డిసెంబర్ 10న తొలి టీ20 మ్యాచ్ జరగనుంది. వెస్టిండీస్ పర్యటన ముగియగానే టీమిండియా దక్షిణాఫ్రికాకు బయలుదేరనుంది. ఆలోపు బీసీసీఐ పర్యటనకు ఎంపికైన ఆటగాళ్ల పేర్లను వెల్లడించనుంది.

టీ 20 సిరీస్ : మొదటి టీ20 డిసెంబర్ 10న దర్బన్ వేదికగా జరనుంది. రెండో టీ20 డిసెంబర్ 12న కెబెర్హా స్టేడియంలో, మూడో టీ20 మ్యాచ్ డిసెంబర్ 14న జొహన్నెస్‌బర్గ్‌లో జరగనున్నాయి.

వన్డే సిరీస్ : డిసెంబర్ 17 జొహన్నెస్‌బర్గ్‌లో మొదటి వన్డే మ్యాచ్‌తో మూడు వన్డేల సిరీస్ మొదలవ్వనుంది. డిసెంబర్ 19 రెండో వన్డే, డిసెంబర్ 21న భారత్, సఫారీ జట్లు మూడో వన్డేలో తలపడనున్నాయి.

టెస్టు సిరీస్ : భారత్, దక్షిణాఫ్రికా జట్లు డిసెంబర్ 26 నుంచి డిసెంబర్ 30 వరకు సెంచూరియన్‌లో మొదటి టెస్టు ఆడనున్నాయి. రెండో టెస్టు జనవరి 3 నుంచి జనవరి 7వ తేదీ వరకు కేప్ టౌన్‌లో జరగనుంది.





## యూఎస్ ఓపెన్‌లో భారత షట్లర్ల జోరు.. క్వార్టర్ ఫైనల్లో పీవీ సింధు, లక్ష్యసేన్

యూఎస్ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్‌లో భారత షట్లర్లు జోరు కొనసాగిస్తున్నారు. ఈమధ్యే కెనడా ఓపెన్ చాంపియన్‌గా నిలిచిన లక్ష్యసేన్ పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టాడు. మహిళల సింగిల్స్‌లో అదరగొడుతున్న పీవీ సింధు కూడా క్వార్టర్స్‌కు చేరింది. సూపర్ ఫామ్‌లో ఉన్న లక్ష్యసేన్ చెక్ రిపబ్లిక్ ఆటగాడు జాన్ లోడా పై 218, 2321తో గెలుపొందాడు. లక్ష్యసేన్ సెమీస్ బెర్తు కోసం భారత్‌కు చెందిన 19 ఏళ్ల ఎస్ శంకర్ ముత్తుస్వామి ని రేపు ఢీ కొట్టనున్నాడు. ఈ సీజన్‌లో ఒక్క ట్రోఫీ నెగ్గని ఒలింపిక్ విజేత సింధు పతకంపై ఆశలు రేపుతోంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో ఆమె తైవాన్‌కు చెందిన సంగ్ షువో యున్‌పై అలవోకగా గెలుపొందింది. వరుసగా రెండు సెట్లలో ఆధిపత్యం చెలాయించిన భారత షట్లర్ 2114, 2112తో సంగ్ షువోను చిత్తుగా ఓడించింది. సింధు క్వార్టర్ ఫైనల్లో చైనా క్రీడాకారిణి గావో ఫాంగ్ జీతో తలపడనుంది. కెనడా ఓపెన్‌లో క్వార్టర్స్‌లోనే ఇంటి దారి పట్టిన సింధు ఈసారి టైటిల్ సాధించాలనే పట్టుదలతో ఉంది.

## తెగిపోయిన తలను తిరిగి అతికించారు... ఇజ్రాయెల్ డాక్టర్ల ఘనత



ప్రపంచ వైద్య చరిత్రలో సరికొత్త అధ్యాయం. ఒక ప్రమాదంలో మెడ నుంచి తెగిపోయి, దాదాపు వేరుపడిపోయిన తలను వైద్యులు గంటల పాటు శ్రమించి, చాలా సర్జరీలు చేసి, తిరిగి విజయవంతంగా అతికించిన ఘటన ఇజ్రాయెల్ లో చోటు చేసుకుంది. ఈ ఘటనను అద్భుతమని వైద్యులు ప్రశంసిస్తున్నారు. తలను అతికించే సర్జరీలు జరిగిన తరువాత కూడా ఆ బాలుడు బ్రతికే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని భావించామని, అయితే, అనూహ్యంగా ఆ బాలుడు తిరిగి కోలుకున్నాడని సర్జరీలు చేసిన వైద్యులు చెబుతున్నారు. తాము చేసింది సాధారణ సర్జరీ కాదని, అయితే, నిపుణులైన వైద్యులు సమయానికి అందుబాటులో ఉండడంతో అది సాధ్యమైందని డాక్టర్ ఒహద్ ఈనవ్ వెల్లడించారు. తన ఒక్కగానొక్క కుమారుడిని బ్రతికించిన వైద్యులకు ఆ బాలుడి తండ్రి కన్నీళ్లతో ధన్యవాదాలు తెలిపాడు. ఇజ్రాయెల్ లోని 12 ఏళ్ల బాలుడు సులేమాన్ హసన్ సైకిల్ పై వెళ్తుండగా, వేగంగా వచ్చిన కారు అతడిని ఢీ కొట్టింది. ఆ ప్రమాదంలో సులేమాన్ కు తీవ్ర గాయాలయ్యాయి. దాంతో పాటు అతడి తల మెడ భాగం నుంచి దాదాపు తెగి పోయింది. కేవలం వెన్నెముకకు కొంత భాగం అతుక్కుని వేలాడుతూ ఉండిపోయింది. ప్రమాదం జరగగానే అక్కడి వారు ఆ బాలుడిని దగ్గర్లోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి తీవ్రతను గమనించిన వైద్యులు అతడిని మెరుగైన వైద్యం కోసం హదస్సా మెడికల్ సెంటర్ కు హెలీకాప్టర్ లో తరలించారు. అక్కడి వైద్యులు వెంటనే అత్యవసర చికిత్స ప్రారంభించారు. మెడ భాగం నుంచి తల దాదాపు వేరు పడి పోయి ఉందని వైద్యులు గుర్తించి, వెంటనే సంబంధిత సర్జరీలు చేయడం ప్రారంభించారు. ఆర్థొపెడిక్ సర్జన్ డాక్టర్ ఒహద్ ఈనవ్ ఆధ్వర్యంలో వైద్యుల బృందం పలు క్లిష్టమైన శస్త్ర చికిత్సలు చేసింది. కొన్ని గంటల పాటు శ్రమించి తలను తిరిగి మెడపై అతికించారు. మెడ భాగంలో కొన్ని ప్లేట్స్ ను, ఫిక్సేషన్స్ ను అమర్చారు. అదృష్టవశాత్తూ, ఆ ఆసుపత్రిలో అత్యంత ఆధునాతన శస్త్ర చికిత్స సామగ్రి ఉంది. అతడి పూర్తి చికిత్సకు దాదాపు నెల రోజుల సమయం పట్టింది. జులై నెలలో తమ ప్రయత్నాలు సఫలమయ్యాయని నిర్ధారణ అయ్యే వరకు ఈ విషయాన్ని వైద్యులు, బాలుడి కుటుంబ సభ్యులు గోప్యంగా ఉంచారు. జులై నెలలో తమ ప్రయత్నం సఫలమైందని గుర్తించి, మీడియాకు విషయం వివరించారు. ఆ బాలుడు సులేమాన్ ను ఆసుపత్రి నుంచి డిస్చార్జ్ చేశారు. ఆ బాలుడు సులేమాన్ ఎవరి సహాయం లేకుండానే నడుస్తున్నాడని, అతడి మెదడు, జ్ఞానేంద్రియాలు సంపూర్ణంగా పని చేస్తున్నాయని వైద్యులు తెలిపారు.

## ఆసియా అథ్లెటిక్స్‌లో తెలుగమ్మాయి సత్తా.. పసిడి పతకం కైవసం




భారత యువ అథ్లెట్ జ్యోతి ఎర్రాజి.. ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకంతో మెరిసింది. మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో ఈ తెలుగమ్మాయి 13.09 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్రస్థానం దక్కించుకుంది. జ్యోతికి ఇదే తొలి మేజర్ ఇంటర్నేషనల్ స్వర్ణం కావడం విశేషం. జపాన్‌కు చెందిన అసుక (13.13 సెకన్లు), మాసుమి (13.26 సె.) వరుసగా రజత కాంస్యాలు దక్కించుకున్నారు. ఈ పోటీల్లో గురువారం జ్యోతి భారత పసిడి ఖాతా తెరువగా.. అజయ్ కుమార్, అబ్దుల్లా అబూబకర్ కూడా బంగారు పతకాలు గెలిచారు. పురుషుల 1500 మీటర్ల పరుగులో అజయ్ 3 నిమిషాలా 41 సెకన్లలో గమ్యాన్ని చేరగా.. ట్రిపుల్ జంప్‌లో అబూబకర్ 16.92 మీటర్లు లంఘించి బంగారు పతకం చేజిక్కించుకున్నాడు. మహిళల 400 మీటర్ల విభాగంలో ఐశ్వర్య మిశ్రా, పురుషుల డెకాథ్లాన్‌లో తేజస్విన్ శంకర్ కాంస్య పతాకలు సాధించారు. దీంతో చాంపియన్‌షిప్ రెండో రోజు భారత్ ఖాతాలో ఐదు పతకాలు చేరాయి. అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాలనే లక్ష్యంతో బరిలోకి దిగా. వర్షం కారణంగా అనుకున్న టైమింగ్ నమోదు చేయలేకపోయా. ఈ ప్రదర్శనతో సంతృప్తిగా ఉన్నా.. ఇక్కడితో ఆగిపోను. తీవ్ర పోటీ ఉండే ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గడం ఆనందంగా ఉంది.

## అన్‌సీడెడ్‌గా వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ ఫైనల్లోకి దూసుకెళ్లిన వొండ్రొసోవా

సీజన్ మూడో గ్రాండ్‌స్లామ్ వింబుల్డన్ మహిళల సింగిల్స్‌లో అన్‌సీడెడ్ మార్కెటా వొండ్రొసోవా (చెక్ రిపబ్లిక్) ఫైనల్‌కు దూసుకెళ్లింది. తద్వారా ఓపెన్ ఎరాలో అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ చేరిన తొలి ప్లేయర్‌గా రికార్డు సృష్టించింది. గురువారం జరిగిన సెమీఫైనల్లో వొండ్రొసోవా 63, 63తో ఎలీనా స్వితోలినాపై విజయం సాధించింది. వొండ్రొసోవాకు ఇది రెండో గ్రాండ్‌స్లామ్ ఫైనల్ కాగా.. క్వార్టర్స్‌లో టాప్ సీడ్ స్వియాటెక్‌ను మట్టికరిపించిన స్వితోలినా సెమీస్‌లో అదే జోరు కొనసాగించలేకపోయింది. గంటా 15 నిమిషాల పాటు సాగిన పోరులో 4 ఏస్‌లు బాదిన వొండ్రొసోవా 22 విన్నర్లు కొట్టింది. మ్యాచ్ మొత్తంలో ఒక్క ఏస్ కూడా కొట్టలేకపోయిన స్వితోలినా.. 9 విన్నర్లకే పరిమితమై మూల్యం చెల్లించుకుంది. మరో సెమీఫైనల్లో ఆరో సీడ్ జాబర్ 67 (5/7), 64, 63తో రెండో సీడ్ సబలెంకపై విజయం సాధించింది. 2 గంటలా 19 నిమిషాల పాటు సాగిన సెమీఫైనల్లో మూడు ఏస్‌లే కొట్టిన జాబర్.. కీలక సమయాల్లో ఆధిక్యం కనబర్చింది. మరోవైపు 10 ఏస్‌లు, 39 విన్నర్లతో ప్రత్యర్థి కన్నా ఎంతో ముందు నిలిచిన సబలెంక.. ఒత్తిడికి చిత్తైంది. శనివారం జరుగనున్న టైటిల్ పోరులో వొండ్రుసోవాతో జాబర్ అమీతుమీ తేల్చుకోనుంది. పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ అల్కరాజ్‌తో పాటు మూడో సీడ్ మెద్వెదెవ్ కూడా సెమీఫైనల్లో అడుగుపెట్టారు.



## వినేశ్ కు నోటీసులు జారీ చేసిన యాంటీడోపింగ్ ఏజెన్సీ

భారత అగ్రశ్రేణి రెజ్లర్ వినేశ్ ఫొగాట్ కు జాతీయ యాంటీడోపింగ్ ఏజెన్సీ నోటీసులు జారీ చేసింది. డోపింగ్ నిరోధక నిబంధనల ఆవశ్యకతను పాటించడంలో పూర్తిగా విఫలమైనందుకు నోటీసులు జారీ చేసింది. దీనిపై స్పందించేందుకు ఫొగాట్ కు రెండు వారాల గడువు ఇచ్చింది. డోపింగ్ నిరోధక నియమాలు పాటించడంలో వినేశ్ విఫలమైనట్లు స్పష్టంగా తెలుస్తోందని నోటీసుల్లో పేర్కొంది. తమ రిజిస్టర్డ్ టెస్టింగ్ పూల్ లో వినేశ్ పేరును చేర్చినట్లు 2022 మార్చి, 2022 డిసెంబరులో ఈమెయిల్ చేసినట్లు తెలిపింది. యాంటీ డోపింగ్ నిబంధనల ప్రకారం.. ప్రతి త్రైమాసికానికి ముందు మీరు ఎక్కడున్నారన్న విషయం ఫైల్ చేయాల్సి ఉంటుందని చెప్పింది. చెప్పిన ప్రదేశంలో చెప్పిన టైంకి డోపింగ్ పరీక్షలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేసింది. అయితే, వినేశ్ ఇటీవలే ఇచ్చిన ఫైలింగ్ లో జూన్ 27న ఉదయం 10 గంటలకు హరియాణాలోని సోనిపట్ లో టెస్టింగ్ కు అందుబాటులో ఉంటానని చెప్పినట్లు ఏజెన్సీ గుర్తు చేసింది. దీంతో వినేశ్ చెప్పిన సమయానికి డోపింగ్ కంట్రోల్ ఆఫీసర్లను ఆ ప్రదేశానికి పంపినట్లు తెలిపింది. అయితే, ఆ లొకేషన్ లో వినేశ్ అందుబాటులో లేకపోవడంతో అధికారులు టెస్టింగ్ చేయలేకపోయారని పేర్కొంది. దీన్ని బట్టి చూస్తే వినేశ్ నిబంధనలను ఉల్లంఘించినట్లు స్పష్టమవుతోందని ఏజెన్సీ నోటీసుల్లో తెలిపింది. ఈ నోటీసులపై 14 రోజుల్లో తన స్పందన తెలియజేయాలని వినేశ్ ను ఏజెన్సీ ఆదేశించింది.



## 24వ టైటిల్‌కు అడుగుదూరం!

పురుషుల సింగిల్స్‌లో 23 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గి అగ్రస్థానంలో ఉన్న సెర్బియా వీరుడు నొవాక్ జొకోవిచ్.. 24వ టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచాడు. సీజన్ మూడో గ్రాండ్‌స్లామ్ వింబుల్డన్ సెమీఫైనల్లో శుక్రవారం రెండో సీడ్ జొకోవిచ్ 63, 64, 76 (7/4)తో ఎనిమిదో సీడ్ సిన్నెర్‌పై విజయం సాధించాడు. టోర్నీ ఆరంభం నుంచి నిలకడ కొనసాగిస్తున్న జొకో.. సెమీస్‌లోనూ మాస్టర్ క్లాస్ ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. జొకోకు గ్రాస్‌కోర్టులో ఇది వరుసగా 34వ విజయం కావడం విశేషం. దాదాపు మూడు గంటల పాటు సాగిన పోరులో జొకో ఆరు బ్రేక్ పాయింట్లను కాచుకున్నాడు. 11 ఏస్‌లు సంధించిన జొకో.. ఒక్క డబుల్ ఫాల్ట్ కూడా చేయలేదు. మరోవైపు 8 ఏస్‌లకే పరిమితమైన సిన్నెర్ 3 డబుల్ ఫాల్ట్స్‌చేసి 44 విన్నర్లు కొట్టాడు. అయితే 35 అనవసర తప్పిదాలు చేసిన సిన్నెర్ అందుకు తగ్గ మూల్యం చెల్లించుకున్నాడు. మరో సెమీఫైనల్లో టాప్ సీడ్ అల్కరాజ్ 63, 63, 63తో మూడో సీడ్ మెద్వెదెవ్‌పై గెలిచి ఫైనల్లో అడుగుపెట్టాడు. తుదిపోరులో అల్కరాజ్‌తో జొకోవిచ్ అమీతుమీ తేల్చుకోనున్నాడు. శనివారం మహిళల ఫైనల్లో వొండ్రుసోవాతో జాబర్ తలపడుతుంది.



1. వరల్డ్వైడ్గా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న హాలీవుడ్ స్టార్ అండ్ యాక్షన్హీరో టామ్‌క్రూజ్. మిషన్ ఇంపాజిబుల్ సిరీస్తో ఎంతో క్రేజ్ దక్కించుకున్న ఈయన.. తాజాగా 'మిషన్: ఇంపాజిబుల్ డెడ్ రికనింగ్ పార్ట్ 1' ప్రేక్షకుల ముందుకు వచ్చి మరోసారి భారీ హిట్ అందుకున్నారు. ఈయన ఇక్కడ నెం.1 స్థానంలో చోటు దక్కించుకున్నారు. అత్యధిక అభిమానం చూరగొన్న హాలీవుడ్ స్టార్ గా నిలిచారు. 2.పుత్నె స్నోవ్పిచ్రితంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యాక్టర్ కమ్ డైరెక్టర్ రోబర్ట్ డి నీ రెండో స్థానంలో నిలిచారు. 3.క్రిస్హేమ్స్వర్త్..సినీ ప్రియులందరికీ దాదాపు సుపరిచితమే. మార్వెల్సినిమాల్లో థోర్ పాత్రతో వర్ల్డ్వైడ్గా అభిమానులను సంపాదిచుకున్న ఈ హీరో మూడో స్థానంలో నిలిచారు. 4. WWE మాజీ స్టార్, హాలీవుడ్ స్టార్ హీరో డ్వేన్ జాన్సన్. కండలు తిరిగిన దేహంతో ఉండే హాలీవుడ్ ఈ స్టార్ని ముద్దుగా ది రాక్అని పిలుస్తారు. ఈయన అత్యంత ప్రజాదరణ పొందిన నటుల్లో నాలుగో ర్యాంకులో నిలిచారు. 5. ఇక ఐదో స్థానంలో మరో నటుడు జానీ డెప్ ఉన్నారు. 6. స్పైడర్ మ్యాన్ ఫేమ్హీరో టామ్ హాలాండ్. ఈయన గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అమ్మాయిల రాకుమారుడు. ఈయన ఆరో ర్యాంకును దక్కించుకున్నారు. 7.ఇక వరల్డ్వైడ్గా సినీ ప్రేమికులకు ఎంతో ఇష్టమైన సిరీస్ ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్. అందులో నటించిన విన్ డీజిల్ అంటే ప్రతి ఒక్కరికీ పిచ్చ క్రేజ్. అయితే ఈయనకు పాపులర్ లిస్ట్ లో ఏడో స్థానాన్ని అందుకున్నారు. 8. అమ్మాయిల రాకుమారుడు, హాలీవుడ్ గ్లామర్ హీరో, టైటానిక్ ఫేమ్ కథానాయకుడులియోనార్డో డికాప్రియో ఎనిమిదో స్థానంలో నిలిచారు. 9. మార్వెల్ కామిక్స్లో హ్యూమన్ టార్చ్ పాత్రలో గుర్తింపు పొందిన క్రిస్ఎవెన్ తొమ్మిదో ర్యాంకునుఅందుకున్నారు. 10. ఇక ఆస్కార్ విజేత హాలీవుడ్ స్టార్బ్రాడ్ పిట్ పదో స్థానంలో నిలిచారు.



# మందు, మటన్, సిగరెట్లకు రజనీకాంత్ అడిక్షన్..
## ఆమె లేకుంటే ఏమయ్యేనో!

ఇండియాలోని బిగ్గెస్ట్ ఫిలిం స్టార్స్‌లో ఒకరైన సూపర్‌స్టార్ రజనీకాంత్ స్టార్‌డమ్ ఏ రేంజ్‌లో ఉంటుందో తెలిసిందే. ప్రత్యేకించి తమిళనాడులో ఆయనకున్న ఫ్యాన్ ఫాలోయింగ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. కెరీర్ మొదట్లో బస్ కండక్టర్‌గానే కాకుండా అనేక చిన్నా చితక ఉద్యోగాలు చేసిన రజినీ.. ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా సినీ రంగంలో ఎవరూ అందుకోలేనంత స్థాయికి చేరుకున్నారు. ఆయన జర్నీ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. అలాంటి రజినీ తన జీవితంలోని ఒక దశలో విపరీతంగా ఆల్కహాల్, సిగరెట్లు, నాన్ వెజ్ ఫుడ్‌కు అడిక్ట్ అయిపోయారట. ఆ లైఫ్‌స్టైల్‌ను నుంచి తాను ఎలా బయటపడ్డాడో రజినీ గతంలో ఒక ఇంటర్వ్యూలో పంచుకోగా.. రీసెంట్‌గా ఈ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. నిజానికి తాను బస్ కండక్టర్‌గా ఉన్నప్పుడే రెగ్యులర్‌గా మటన్ తినడంతో పాటు మందు, సిగరెట్లు ఇష్టమొచ్చినట్లు తాగేవాడినని సూపర్‌స్టార్ గతంలో వెల్లడించారు. ఇక నటుడిగా డబ్బు, పేరు సంపాదించాక తనను తాను కంట్రోల్ చేసుకోలేకపోయారట. అయతే ఆ ఫేజ్‌ను అధిగమించడానికి తన భార్య లత సాయపడిందన్న సూపర్‌స్టార్.. ఆమెకు థాంక్స్ కూడా చెప్పారు. ప్రస్తుతం 73 ఏళ్ల వయసున్న తలైవా.. కండక్టర్‌గా ఉన్నప్పుడు కొన్ని చెడు స్నేహాల వల్ల ఇవి అలవాటయ్యాయని చెప్పారు. ఆ టైమ్‌లో రోజుకు రెండుసార్లు మటన్ తినడమే కాక రోజూ మందు తాగేవాడినని.. ఇక సిగరెట్లు అయితే లెక్కేలేదన్నారు.
సిగరెట్, ఆల్కహాల్, నాన్ వెజ్.. ఈ మూడింటిని ప్రమాదకరమైన కాంబినేషన్‌గా పేర్కొన్నారు రజినీకాంత్. లిమిట్ లేకుండా ఇవన్నీ చేసేవారు 60 ఏళ్లు నిండకముందే ఎన్నో అనారోగ్య సమస్యలు ఎదుర్కొన్న ఉదాహరణలు చాలానే ఉన్నాయన్నారు. అయితే, భార్య లత ప్రేమతో పాటు సరైన వైద్యుల గైడెన్స్ తనను మార్చేసిందన్న రజినీ.. ఆమెను పెళ్లి చేసుకోవడానికి కారణమైన వైజీ మహేంద్రకు ఈ సందర్భంగా థాంక్స్ చెప్పారు. ఇదిలా ఉంటే.. రజినీకాంత్ కిడ్నీ సంబంధిత వ్యాధితో రోజుల తరబడి ఆసుపత్రిలో ఉన్నారు. చికిత్స అనంతరం పూర్తిగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగొచ్చారు. ఇక రాజకీయాల్లో ఎంట్రీ ఇవ్వడానికి ఆయన ప్రయత్నాలు చేసినప్పటికీ.. వయసు, ఆరోగ్య సమస్యల దృష్ట్యా ఆ ఆలోచన విరమించుకున్నారు. ప్రస్తుతం రజినీ నటించిన 'జైలర్' మూవీ ఆగస్టు 11న విడుదల కానుంది.





# అనసూయ రచ్చ.. వాళ్లతో కలిసి ఫుల్ ఎంజాయ్ చేస్తోందిగా!

అనసూయ.. అమెరికా అంటే అనకాపల్లికి వెళ్లినంత ఈజీగా వెళ్లి వస్తున్నట్టుగా అనిపిస్తోంది. ఈ మధ్య కాలంలో ఆమె ఆ దేశంలో ఎంజాయ్ చేస్తూ దిగిన ఫొటోలను, వీడియోలను తెగ షేర్ చేస్తోంది. మరి ఎప్పుడు వెళ్తుందో, ఎప్పుడు తిరిగి వస్తుందో తెలియదు కానీ.. తాజాగా మరో కొత్త వీడియోను పోస్ట్ చేసింది. ఈ సారి ప్రపంచంలోనే అతి పెద్దదైనా ఆ ప్లేస్ లోకి వెళ్లి ఫుల్ ఎంజాయ్ చేసింది. యాక్టర్ కమ్ యాంకర్ అనసూయ గురించి తెలుగు ఆడియెన్స్ కు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. జబర్దస్త్ కామెడీ షోతో ఫుల్ క్రేజ్ దక్కించుకున్న ఈ ముద్దుగుమ్మ.. సిల్వర్ స్క్రీన్ పై ఏమాత్రం తగ్గట్లేదు. పెళ్లై ఇద్దరు పిల్లలు ఉన్నా కూడా తన గ్లామర్, నటనతో ఆకట్టుకుంటోంది. పాత్ర ఏదైనా సరే, ఫొటోషూట్ ఎలాంటిది అయినా సరే.. అస్సలు తగ్గట్లేదు. చీరు కట్టినా, బికినీ వేసినా ఒంపుసొంపులు చూపిస్తూ తన విలక్షణ యాక్టింగ్ తో అదరగొట్టేస్తోంది. అలా ఇప్పటికే తన అంద చందాలతో కుర్రకారును ఎంతగానో ఆకట్టుకున్న ఈ ముద్దుగుమ్మ.. ప్రస్తుతం సినిమాలతో ఫుల్ బిజీ అయిపోయింది. సుకుమార్ 'రంగస్థలం' సినిమాలో 'రంగమ్మత్త' పాత్రతో ప్రేక్షకులకు దగ్గరైన ఈ భామకు సినిమా ఛాన్స్ లు వరుసగా క్యూ కట్టాయి. అలానే లేడి ఓరియెంటెడ్ చిత్రాలు కూడా చేసింది. ఈ క్రమంలోనే సుకుమార్ దర్శకత్వంలో మరోసారి 'పుష్ప' దాక్షయినీగా అలరించింది. ప్రస్తుతం పలు చిత్రాలు చేస్తూ బిజీగా ఉంటోంది. సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్ గా ఉంటూ తన అందాలను ఎప్పటికప్పుడు ఆరబోస్తుంటుంది. అలాగే వివాదస్పద ట్వీట్లు చేస్తూ వార్తల్లో నిలుస్తుంటుంది. ఈ మధ్య కాలంలో అమెరికాకు పలు సార్లు వెళ్లి వచ్చింది. అక్కడ ఎంజాయ్ చేసిన ఫొటోలను, వీడియోలను షేర్ చేస్తోంది. పబ్లిక్ రోడ్స్ పై గ్లామర్ షో చేస్తూ రచ్చ రచ్చ చేస్తోంది. మోడ్రన్ ఔట్ ఫిట్లలో నాభి అందాలను, ఎద అందాలను చూపిస్తూ అలరిస్తోందని నెటిజన్లు కామెంట్లు కూడా పెడుతున్నారు.

# ఫారెస్ట్ థీమ్‌తో ఎంత అందంగా ఉందో.. మీరు చూశారా?



మెగాస్టార్ రామ్ చరణ్ ఉపాసన దంపతులకు ఇటీవలే ఓ పండంటి ఆడబిడ్డ జన్మించిన సంగతి తెలిసిందే. ఆ పాపకు క్లీంకార అని నామకరణం కూడా చేశారు. అయితే ఇప్పుడు ఆ పాప కోసం ఓ స్పెషల్ నర్సరీని తీర్చిదిద్దుతున్నట్లు ఉపాసన ఓ స్పెషల్ వీడియోను పోస్ట్ చేశారు. రామ్ చరణ్, ఉపాసనల పెళ్లి 2012 జూన్ 24న గ్రాండ్ గా జరిగింది. ఆ తర్వాత పెళ్లైన 11 ఏళ్ళకు ఈ జంటకు ఓ పండంటి ఆడబిడ్డ జన్మించింది. దీంతో మెగా ఫ్యామిలీతో పాటు మెగా అభిమానులంతా సంబరాలు చేసుకున్నారు. రీసెంట్ గా ఆ మెగా వారసురాలి బారసాల కూడా ఘనంగా చేశారు. ఈ వేడుకకు మెగా కుటుంబంతో పాటు పలువురు సెలబ్రిటీలు హాజరై పాపను ఆశీర్వదించారు. పాపకు క్లీంకార అని నామకరణం చేశారు. సాధారణంగా సెలబ్రిటీలు అంటే ఎంత జాగ్రత్తగా ఉంటారో తెలిసిన విషయమే. ఇక తమ పిల్లల కోసం కావాల్సిన ప్రతి ఒక్కటినీ అందుబాటులో ఉంచుతారు. అన్నీ సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తారు. అలానే రామ్ చరణ్ ఉపాసన కూడా తమ పాప కోసం ముందునుంచే అన్నీ జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నారు. కావాల్సిన అన్నింటినీ ముందుగానే అందుబాటులో ఉంచుతున్నారు. అమె కోసం ఓ ప్రశాంతమైన ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ఈ క్రమంలోనే పాప క్లీంకార కోసం రామ్ చరణ్ ఉపాసన ఓ స్పెషల్ నర్సరీ రూమ్ ను తయారు చేయించారు. ఫారెస్ట్ థీమ్ తో ఈ నర్సరీని రూపొందించినట్లు తెలిపారు ఉపాసన. ఓ స్పెషల్ డిజైనర్ చేత ఇదంతా ఏర్పాటు చేయించినట్లు పేర్కొన్నారు. ఉపాసన ఈ మధ్యనే తల్లి అయిన నేపథ్యంలో ఆమెకు ప్రశాంతత చేకూరేలా దృష్టిలో ఉంచుకుని ఈ నర్సరీ గదిని రూపొందించాం. అలాగే ఈ నర్సరీ.. అడవులపై రామ్ఉపాసనలకు ఉన్న ప్రేమను ప్రతిబింబిస్తుంది. పాప వాటిని చూడగానే ప్రేమించగలిగేలా ఈ గదిలో ప్రతీదాన్ని ఏర్పాటు చేశాం అని నర్సరీ డిజైనర్ పేర్కొన్నారు. ఇంకా ఈ నర్సరీ గదిలో ఏం ఉన్నాయో పూర్తిగా చూపించారు. పిల్లలు ఆడుకునే బేబీ షీప్, పెంగ్విన్, కుందేలు, ఏనుగు వంటి బొమ్మలతో రూమ్ లోని షెల్ఫ్ లను నింపారు. గోడకు అద్భుతమైన వాల్ పేపర్స్ ను ఏర్పాటు చేశారు. దీన్ని ఫారెస్ట్ థీమ్ తో రూపొందించారు. జింకలు, ఏనుగులు వంటి జంతువులతో పాటు కొబ్బరి చెట్టు, పూల మొక్కలు వంటివి ఆ వాల్ పేపర్స్ పై డిజైన్ చేశారు. ఓ అడవిని తలపించేలా దానిని తయారు చేయించారు. సోఫాస్, కర్టెయిన్స్ ఇంకా పలు సామాగ్రిని గదిలో పొందుపరిచారు. మొత్తంగా ట్రాన్స్ పరెంట్ కలర్ తో ఉన్న ఈ నర్సరీ రూమ్ ఎంతో కూల్ గా, అందంగా ఆకర్షణీయనంగా తీర్చిదిద్దారు.



# ఆ ఇద్దరి వల్లే సమంత ఇలా ఉంటుందట...

హీరోయిన్ సమంత ఏడాది పాటు బ్రేక్ తీసుకోనున్నట్లు గత కొద్ది రోజులుగా జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే తాజాగా ఆమె ఓ పోస్ట్ పెట్టింది. అది చూస్తుంటే బ్రేక్ గురించే ఆమె మాట్లాడినట్టు అనిపిస్తోంది. కెరీర్ లో వరుస సినిమాలు చేసుకుంటూ ముందుకెళ్తోంది. హిట్ , ఫ్లాపులతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తోంది. ఆ మధ్యలో యశోదతో హిట్ అందుకున్న ఈ భామ.. ఆ తర్వాత శాకుతలంతో భారీ డిజాస్టర్ ను అందుకుంది. ప్రస్తుతం ఈ అందాల తార.. తెలుగులో విజయ్ దేవరకొండతో ఖుషి, హిందీలో సిటాడెల్ ఇండియన్ వెర్షన్ చేస్తోంది. తాజాగా ఈ రెండు చిత్రీకరణలు పూర్తయ్యాయి. రీసెంట్ ఈ ముద్దుగుమ్మ ఖుషి, సిటాడెల్ షూటింగ్ లు పూర్తి చేశాక ఏడాది పాటు బ్రేక్ తీసుకోబోతున్నట్లు వార్తలు వచ్చాయి. దీంతో అందరూ షాక్ అయ్యారు. ఆరోగ్యంపై పూర్తిగా దృష్టి పెట్టేందుకు విదేశాలకు వెళ్లబోతుందని అన్నారు. అప్పట్లో మయోసైటిస్ తో ఈ ముద్దుగుమ్మ బాధపడింది. ఇప్పుడా రోగాన్ని పూర్తిగా నయం చేసుకునేందుకు ఫారెన్ వెళ్లనుందట. తాజాగా సమంత ఓ పోస్ట్ చేసింది. సిటాడెల్ వెబ్ సిరీస్ షూట్ పూర్తైనట్లు తెలిపింది. దర్శకులు రాజ్ అండ్ డీకే కలిసి దిగిన ఫొటోను పోస్ట్ చేసింది. సిటాడెల్ ఇండియన్ వెర్షన్ షూటింగ్ పూర్తి చేశాను. ఫలితం ఏం రానుందో తెలియనప్పుడు బ్రేక్ అనేది చెడ్డ విషయంగా అనిపించదు. రాజ్ అండ్ డీకే నాకు ఫ్యామిలీతో సమానంగా భావిస్తాను. ప్రతి ఒక్క సమస్యను ధైర్యంగా పోరాడేందుకు రాజ్ అండ్ డీకే నాకు ఎంతగానో సపోర్ట్ చేశారు. ధన్యవాదాలు. ప్రపంచంలోని అన్నింటి కన్నా ఎక్కువగా మిమ్మల్ని గర్వపడేలా చేయాలని ఆశిస్తున్నాను. నా లైఫ్ లో ఎప్పటికీ గుర్తుండిపోయే పాత్రను ఇచ్చినందుకు ధన్యవాదాలు. మీరు నాకోసం మరో పాత్ర క్రియేట్ చేసే వరకు ఇదే నాకు బెస్ట్ అని సమంత రాసుకొచ్చింది. సమంత పెట్టిన ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ గా మారింది. దీన్ని చూసిన నెటిజన్లు, అభిమానులు.. సమంత పెట్టిన పోస్ట్ బ్రేక్ గురించేనని మట్లాడుకుంటున్నారు. ఏదిఏమైనా సమంత ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నారు. వీపరీతంగా లైక్స్, కామెంట్స్ పెడుతున్నారు. అలాగే ఇంకొంతమంది ట్రోల్స్ కూడా చేస్తున్నారు. సమంత నటించిన ఖుషి సినిమా సెప్టెంబరు 1న గ్రాండ్ గా రిలీజ్ కానుంది. లవ్ అండ్ రొమాంటిక్ ఎంటర్ టైనర్ గా రానున్న ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ హీరోగా నటించారు. శివనిర్వాణ్ దర్శకత్వం వహించారు. ఇక సిటాడెల్ విషయానికొస్తే ఇది కూడా త్వరలోనే అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. అలా ఈ రెండు రిలీజ్ కు సిద్ధమవ్వడంతో పాటు ప్రమోషన్స్ కోసం రెడీ అయ్యాయి. మరి ఈ ప్రచారాల్లో సమంత పాల్గొంటుందో లేదో చూడాలి..



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com